వార్తా పత్రికలు,
అధిక సంఖ్యలో పుస్తకముల ముద్రణ కోసం సంప్రదించండి.
9393949345.
విశాఖ సమాచారమ్ ప్రెస్
మల్టీకలర్ వెబ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

విలేకరులు కావలెను
విశాఖ సమాచారమ్
తెలుగు దినపత్రికకు దిగువ తెలిపిన ప్రాంతములలో విలేకరులు కావలెను.
గాజువాక, పాయకరావుపేట, కోటవురట్ల, నర్సీపట్నం, అడ్డురోడ్డు, తాళ్లపాలెం, ఎస్.కోట, కొత్తవలస, పెందుర్తి, ఆనందపురం, తగరపువలస, విజయనగరం, శ్రీకాకుళం రూరల్.
సంప్రదించండి : 9393949345, 7013785256

RNI No.52722/90 సంపుటి : 33 సంచిక : 159 విశాఖపట్నం, 04 ఏప్రియల్ 2023 ఆదివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## సీబీఐ లేకపోతే మేము లేము: ప్రధాని



న్యూఢిల్లీ: కొంతకాలంగా దేశంలో సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు తీవ్రతరం అవుతూ వస్తోన్నాయి. అనేక కీలక కేసులను ఈ రెండు సంస్థలు విచారిస్తోన్నాయి. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యోదంతం, ఢిల్లీ లిక్కర్ కుంభకోణం సహా ఏపీ, తెలంగాణకు చెందిన పలు సంచలన కేసులపై దృష్టి సారించాయి ఈ రెండు సంస్థలు కూడా. సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను.. వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని, ప్రతిపక్షాలపై మాత్రమే వాటిని ప్రయోగిస్తోందనే ఆరోపణలు లేకపోలేదు.

ఈ పరిణామాల మధ్య ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవ్వాళ ఆయన న్యూఢిల్లీలో సీబీఐ డైమండ్ జూబ్లీ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ మధ్యకాలంలో సీబీఐ అధికారులు ఎవరిపై దాడులు సాగిస్తోన్నారో.. వారంతా అత్యంత శక్తిమంతులని, సుదీర్ఘకాలంగా ప్రభుత్వం, ఇతర వ్యవస్థలో పాతుకు పోయారని ప్రతిపక్షాల గురించి పరోక్షంగా విమర్శించారు. తమ పలుకుబడితో వ్యవస్థలను ధ్వంసం చేశారని ఆరోపించారు.

అలాంటి రాజకీయ శక్తులు.. ఇప్పటికీ కొన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నాయని ప్రధాని మోదీ తేల్చి చెప్పారు. అలాంటి వారిపై తమ దాడులను తీవ్రతరం చేయాల్సి ఉంటుందని సీబీఐ అధికారులకు సూచించారు. కొన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నారనే కారణంతో వారిని వదిలేయాల్సిన పని లేదని చెప్పారు. సీబీఐ అధికారులు తమ పని తాము చేసుకుంటూ వెళ్లాలని, తమ దృష్టి మొత్తం విధి నిర్వహణ మీదే ఉంచాలని అన్నారు. ప్రధాని మోదీ వారికి దిశా నిర్దేశం చేశారు.

10 సంవత్సరాల కిందట

(మిగతా 2లో)

## పార్టీ సీనియర్లకు సీఎం జగన్ కీలక బాధ్యతలు..!?



ఎన్నికలకు సీఎం జగన్ పార్టీని సిద్ధం చేస్తున్నారు. పక్కా లెక్కతో ముందుకు వెళుతున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి తన లక్ష్యం స్పష్టం చేసారు. ప్రతి ఇంటికీ మన ప్రభుత్వం చేస్తున్నమంచిని ప్రతికుటుంబానికీ తీసుకెళ్లాలని నిర్దేశించారు.

ఎన్నికల సంవత్సరంలో ఉన్నామని గుర్తించాలని చెప్పిన సీఎం..కేడర్ అత్యంత క్రియాశీలకంగా ఉండాలని నిర్దేశించారు. తాను ఎవరినీ వదులుకోవటానికి సిద్దంగా లేనని స్పష్టం చేసారు. ఇదే సమయంలో తాజా పరిణామాల నేపథ్యంలో పార్టీ రీజనల్ ఇంఛార్జ్ లతో సీఎం జగన్ కీలక సమావేశం నిర్వహించనున్నారు.

ఏ ఒక్కరనీ వదులుకోను: ఏ ఒక్క ఎమ్మెల్యేను పోగొట్టుకోవటానికి సిద్దంగా లేనని ముఖ్యమంత్రి జగన్ స్పష్టం చేసారు. అందరితో పని చేయించి..మళ్లీ గెలిపించాలనేదే తన లక్ష్యమని స్పష్టం చేసారు. కోట్లాది మంది ప్రస్తుత ప్రభుత్వం పైన ఆధార పడి ఉన్నాయని సీఎం వివరించారు. ప్రజల్లో ఎమ్మెల్యే గ్రాఫ్ సరిగ్గా లేకపోతే పార్టీకి, కేడర్ కు నష్టం జరుగుతుందన్నారు.

తాను తన తండ్రి నుంచి నేర్చుకున్నది రాజకీయాలంటే మానవ సంబంధాలేనని చెప్పుకొచ్చారు. ఎన్నికల సంవత్సరంలో ఉన్నామని గుర్తుంచుకోవాలని సీఎం సూచించారు. పార్టీ ఎమ్మెల్యేలకు తన వైఖరి స్పష్టం చేసిన సీఎం జగన్ ఇప్పుడు పార్టీ ప్రాంతీయ సమన్వయ కర్తలతో కీలక సమావేశానికి నిర్ణయించారు. మంగళవారం ఈ సమావేశం జరగనుంది.

పార్టీ నేతలకు కీలక బాధ్యతలు: ప్రాంతీయ సమన్వయకర్తల సమావేశంలో సీఎం జగన్ వారికి కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. ఎన్నికలకు సిద్ధం అవుతున్న వేళ ప్రధానంగా ఎమ్మెల్యేలు - పార్టీ కేడర్ తో సత్సంబంధాల పైన సీఎం వారికి దిశా నిర్దేశం చేసే అవకాశం కనిపిస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల గురించి ఎమ్మెల్యేలకు వివరించిన సీఎం జగన్..

ఇక ఎమ్మెల్యేలకు రీజనల్ కో ఆర్డినేటర్లు అన్ని సమయాల్లోనూ అందుబాటులో ఉంటూ.. వారితో క్షేత్ర స్థాయిలో వాలంటీర్లు.. గృహసారథులను సమన్వయం చేసుకొనే బాధ్యతలను అప్పగించనున్నారు. అదే సమయంలో ప్రాంతీయ సమన్వయ కర్తలు తమ పరిధిలోని ప్రతీ ఎమ్మెల్యేతోనూ టచ్ లో ఉండి.. పార్టీ - ప్రభుత్వం పరంగా ఏం చేయాలనే దాని పైన కసరత్తు చేసి..నివేదికలు ఇవ్వాలని సూచించనట్లు తెలుస్తోంది.

ఎన్నికల ప్రచారంలోకి పార్టీ నేతలు: ప్రతిపక్షాల ప్రచారం పైనా

(మిగతా 2లో)

## కరోనాను మర్చిపోతున్నారా?



### ఒక్కరోజులో 3,641 కరోనాకేసులు- 11మరణాలు

భారతదేశంలో కరోనా కేసుల ఆందోళన కొనసాగుతూనే ఉంది. రోజురోజుకీ కరోనా కేసులు పెరుగుతుండడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆందోళనకు గురిచేస్తుంది. ప్రజలను అప్రమత్తం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నా ప్రజలలో మాత్రం కరోనా పట్ల భయం కనిపించడం లేదు. మాస్కులు ధరిస్తున్న వారు బయట కనిపించిన దాఖలాలు కూడా లేవు. కరోనా లేదు అన్నట్టే ప్రజలు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. అయితే పెరుగుతున్న కరోనా కేసులు ప్రజలందరూ అప్రమత్తం అవ్వాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయి.

గత 24 గంటల్లో భారత దేశంలో 3641 కరోనా కొత్త కేసులు నమోదైనట్టు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ గణాంకాలు వెల్లడించాయి. గత 24 గంటల్లో 59 వేల 512 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేయగా 3,641 కరోనా కేసులు నమోదైనట్టు కేంద్రం పేర్కొంది. దీంతో కరోనా బారిన పడిన వారి సంఖ్య 4కోట్ల 47 లక్షల 26 వేల 246కు చేరుకుంది. ప్రస్తుతం దేశంలో 20,219 కరోనా యాక్టివ్ కేసులు నమోదయ్యాయి. కరోనా యాక్టివ్ కేసులు 20,000 మార్కును దాటడం ప్రస్తుతం ఆందోళన కలిగిస్తుంది. ఇప్పటివరకు నమోదైన మొత్తం కేసుల్లో 0.05% కేసులు యాక్టివ్ కేసులు ఉన్నాయని కేంద్ర ఆరోగ్య శాఖ గణాంకాలు తెలిపాయి.

గత 24 గంటల్లో కరోనా మహమ్మారి కారణంగా దేశవ్యాప్తంగా మొత్తం 11 మంది మృతి చెందారు. దీంతో దేశంలో మొత్తంగా కరోనా

(మిగతా 2లో)

## జివిఎంసిలో "స్పందన"కు 101 వినతులు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): జివిఎంసి ప్రధాన కార్యాలయంలో మీటింగ్ హాలు నందు "స్పందన" కార్యక్రమంను జివిఎంసి కమిషనర్ పి రాజా బాబు ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ ఎస్ ఎస్ వర్మ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ "స్పందన" కార్యక్రమంలో ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులు స్వీకరించామని వాటిలో ఒకటవ జోన్ కు 1, రెండవ జోన్ కు 11, మూడువ జోన్ కు 15, నాల్గవ జోన్ కు 7, ఐదవ జోన్ కు 22, ఆరువ జోనుకు 29, ఎనిమిదవ జోన్ కు 6, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 10 ఫిర్యాదులు, మొత్తము 101 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిలో పరిపాలన & అక్కౌంట్స్ కు 1, రెవెన్యూ నకు 12, ప్రజారోగ్యానికి 9, టౌన్ ప్లానింగ్ కు 49, ఇంజినీరింగ్ కు 17, హార్టికల్చర్ కు 1, యుసిడికి 12 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని పరిశీలించి ఈ ఫిర్యాదులను 03 రోజులలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

ప్రతివారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న "స్పందన" కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరిస్తున్న వినతులు, సలహాల అంశాలపై ఆయా విభాగాధిపతులు చేపట్టిన చర్యలకు సంబంధించి వివరాలతో కూడిన సమాచారంతో..., ఆ తరువాత వారం వచ్చే "స్పందన" కార్యక్రమానికి ముందుగా సమర్పించవలసిన వివరాలుతో ఆయా విభాగాధిపతులు సిద్ధం చేయాలని తెలిపారు. ఆయా వివరాలను తరువాత వారంలో సమర్పించడం వలన నిర్ణీత సమయంలో ఎన్ని సమస్యలు పరిష్కారం అవుతున్నాయో తెలుసుకోవడానికి వీలుగా ఉంటుందని సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వై. శ్రీనివాస రావు, డాక్టర్ వి. సన్యాసి రావు, డిసి(రెవెన్యూ) ఫణిరాం, సెక్రటరీ పి. నల్లనయ్య, ఎఫ్.ఎ & ఎ.ఓ మల్లికాంబ, డిపిఓ చంద్రిక, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అక్కౌంట్స్, డిసిపిలు, ఎసిపిలు, పర్యవేక్షక ఇంజినీర్లు, యుసిడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి జలాలు కాలుష్యరహితం

న్యూఢిల్లీ: గోదావరి నదీ జలాల్లో కాలుష్యం లేదని జలశక్తి శాఖ సహాయ మంత్రి శ్రీ బిశ్వేశ్వర్ తుడు వెల్లడించారు. రాజ్యసభలో సోమవారం వైఎస్సార్సీపీ సభ్యులు శ్రీ వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ ఈ విషయం తెలిపారు. దేశంలోని కలుషిత నదీ భాగాలను గుర్తిస్తూ 2018 సెప్టెంబర్‌లో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబి) విడుదల చేసిన నివేదిక ప్రకారం రాయనపేట నుంచి రాజమండ్రి వరకు గోదావరినదీ జలాలు కలుషితం అయినట్లు గుర్తించినప్పటికీ నవంబర్ 2022 సీపీసీబి నివేదికలో ఆ జాబితా నుంచిగోదావరిని తొలగించినట్లు మంత్రి పేర్కొన్నారు. రాజమండ్రి వద్ద గోదావరి జలాల్లో కాలుష్య నిర్మూలన, నదీ జలాల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ రివర్ కన్జర్వేషన్ ప్లాన్ (ఎన్ఆర్సీపీ) పథకం కింద 110.22 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు.



గోదావరి నదీ జలాల్లో కాలుష్య నిర్మూలన కోసంరాజమండ్రి సమీపంలోని హుకుంపేటవద్ద రోజుకు 30 మిలియన్ లీటర్లు శుద్ధి చేసే సామర్థ్యంతో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణంతో పాటు ఇతర చర్యలు చేపట్టినట్లుతెలిపారు. అలాగే 2022 మార్చిలో గోదావరి నదీజలాల సంరక్షణ, కాలుష్య నిర్మూలన కోసం ఎన్ఆర్సీపీ పథకం కింద హుకుంపేట వద్ద అదనంగా రోజుకు 50 మిలియన్ లీటర్ల సామర్థ్యంగల మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణానికి 88.43 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు చెప్పారు. 2025 మార్చి నాటికి దీని నిర్మాణం పూర్తి కావాల్సి ఉందని ఆయన అన్నారు.నేషనల్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ ప్రోగ్రాం (ఎన్‌డబ్ల్యూసీఎం) కింద సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు/ పొల్యూషన్ కంట్రోల్ కమిటీలతో కలిసి మానిటరింగ్ స్టేషన్స్ నెట్‌వర్క్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న నదులు, నీటి వనరులలో నాణ్యతను నిరంతరాయంగా పర్యవేక్షిస్తుందని మంత్రి తెలిపారు.పర్యవేక్షణ ఫలితాల ఆధారంగా సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సమయానుసారంగా నీటి నాణ్యతను మూల్య నిర్ధారణ చేస్తుందని అన్నారు. నమామి గంగే మాదిరిగా నమామి గోదావరి ప్రాజెక్ట్ ప్రారంభించే యోచన ప్రస్తుతానికి లేదని మంత్రి స్పష్టం చేశారు.

## పదవ తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): పదవ తరగతి పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ డా ఎ మల్లికార్జున ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ జిల్లా కేంద్రంలో గల కె డి పి ఎం ప్రభుత్వ పాఠశాల , కోటక్ పాఠశాలల లో జరుగుతున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ పాఠశాలలో పదవ తరగతి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థుల ఓఎంఆర్ షీట్, పశ్నా పత్రాలను పరిశీలించారు. విద్యార్థులు పరీక్షా సమయాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవా లన్నారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పరీక్షా కేంద్రాల్లో ఎవరు కూడా మొబైల్ ఫోన్ లను తీసుకొని రాకుండా చూడాలని అన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును పరిశీలించారు. ఈ పరీక్షల సమయంలో త్రాగునీరు , విద్యుత్ అంతరాయ సమస్యలు లేకుండా చూసి విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని సంభందిత ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట డి.ఈ.ఓ. చంద్రకళ , పాఠశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నుంచి బాలలను దూరం చేసేందుకు సంయుక్త కార్యాచరణ



విజయనగరం: బాలల కోసం ప్రతి జిల్లాలో అబ్జర్వేషన్ హెూం(పునరావాస కేంద్రం) వుండాలనేది జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ లక్ష్యమని కమిషన్ సభ్యులు డా.ఆర్.జి.ఆనంద్ చెప్పారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో అబ్జర్వేషన్ హెూంలు లేనిచోట వాటిని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేస్తున్నట్టు వెల్లడించారు. దక్షిణాదిలోని ఆంధ్రప్రదేశ్ తో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి తదితర ఐదు రాష్ట్రాల్లో 22 జిల్లాలను తాను అబర్జర్వేషన్ హెూంల ఏర్పాటు కోసం సందర్శిస్తున్నట్టు పేర్కొన్నారు. చాలా ప్రాంతాల్లో ఇవి లేనట్లు గుర్తించామన్నారు. నగరంలోని జిల్లాపరిషత్ అతిథిగృహంలో జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డా.ఆనం సోమవారం రాష్ట్ర బాలహక్కుల కమిషన్ అధ్యక్షుడు కేశలి అప్పారావుతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో బాలలపై నేరాలు లేనప్పటికీ బాలల పునరావాస గృహం ఏర్పాటు చేయడం అవసరమని పేర్కొన్నారు.

రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర బాలల హక్కుల కమిషన్‌తో కలసి కార్యక్రమాలు చేస్తున్నామని, రాష్ట్ర కమిషన్ పూర్తి సహకారాన్ని అందిస్తోందన్నారు. రాష్ట్రంలో బాలల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి అద్భుతమైన కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోడి ఆశయాలను నెరవేర్చే దిశగా కృషిచేస్తున్నారని పేర్కొన్నారు.

జిల్లాను డ్రగ్స్ రహితంగా, బాల్య వివాహాలను లేని జిల్లాగా రూపొందించే దిశగా రాష్ట్ర కమిషన్ తో కలసి సంయుక్త కార్యాచరణ చేపడుతున్నట్టు తెలిపారు. చైల్డ్ ఫ్రెండ్లీ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను రూపొందించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

ఒక రోజు జిల్లా ఆకస్మిక పర్యటన కోసం సోమవారం జిల్లా కేంద్రానికి చేరుకున్న బాలల హక్కుల కమిషన్ జాతీయ సభ్యులు డా.ఆనంద్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ.సూర్యకుమారిని కలిసి జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణకు చేపడుతున్న చర్యలపై చర్చించారు. నగరంలోని దిశ పోలీస్ స్టేషన్ ను సందర్శించి మహిళలపై అకృత్యాలను నిరోధించేందుకు చేపడుతున్న చర్యలను డి.ఎస్.పి.

(మిగతా 2లో)

## (మొదటి పేజీ తరువాయిలు)

### సీబీఐ లేకపోతే మేము లేము: ప్రధాని

దేశంలో ఎక్కడ చూసినా అవినీతి పేరుకుపోయి ఉండేదని ప్రధాని వ్యాఖ్యానించారు. ఆ సమయంలో ఎన్నో భారీ కుంభకోణాలు చోటు చేసుకున్నాయని, నిందితులు ఏ మాత్రం భయపడలేదని అన్నారు. కుంభకోణాలకు పాల్పడిన వారికి కొన్ని వ్యవస్థలు అండగా నిలవడమేనని చెప్పారు. 2014 తరువాత అవినీతి, నల్లధనానికి వ్యతిరేకంగా తాము యుద్ధాన్ని ప్రకటించామని, అదే తీవ్రతతో అవినీతిపరులపై దాడులు చేయిస్తోన్నామని అన్నారు.

అవినీతిపరులపై సాగిస్తోన్న దాడులను చూసిన అనంతరం సామాన్యుల్లో సీబీఐ పట్ల ఆశ కలిగిందని, తమకు ఓ అండ లభించిందనే ధైర్యాన్ని ఇచ్చిందని చెప్పారు. న్యాయానికి బ్రాండ్‌గా సీబీఐ ఇప్పుడు ఆవిర్భవించిదని మోదీ కితాబిచ్చారు. సీబీఐ విచారణల కోసం ప్రజలు డిమాండ్ చేయడం మొదలు పెట్టడమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. సీబీఐ వంటి సమర్థవంతమైన సంస్థలు లేకుండా భారత్ ముందుకు సాగదని చెప్పారు. బ్యాంకు మోసాల నుంచి వన్యప్రాణులకు సంరక్షణ వరకు సీబీఐ పరిధి పెరిగిందని గుర్తు చేశారు.

### కరోనాను మర్చిపోతున్నారా?

మరణాల సంఖ్య 5,30,892 కు చేరుకుంది. కేరళ, రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో మొత్తం 11 మంది నిన్న ఒక్కరోజే కరోనా కారణంగా మృతి చెందారు. ఇక ప్రస్తుతం కరోనా రికవరీ రేటు 98.76% గా ఉంది. మరణాల రేటు 1.19 శాతంగా నమోదయింది. ఇప్పటివరకు కేంద్రం 220. 66 కోట్ల కరోనా వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేసింది. కాగా ప్రజలలో మాత్రం కరోనా మహమ్మారి పట్ల భయం లేకుండా పోయింది. అయితే రోజురోజుకీ పెరుగుతున్న కరోనా కేసుల నేపథ్యంలో ప్రజలు తప్పనిసరిగా మాస్కులు, ధరించాలని అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వాలు పదేపదే హెచ్చరిస్తున్నాయి.

### పార్టీ సీనియర్లకు సీఎం జగన్ కీలక బాధ్యతలు..!?

సీఎం జగన్ కీలక సూచనలు చేసారు. ఈ నెలలో ఎమ్మెల్యేలు గడపకు గడపకు ప్రభుత్వం, జగనన్నే మా లక్ష్యం, జగనన్నకు చెబుదాం వంటి కార్యక్రమాల ద్వారా ఇక పూర్తిగా ప్రజల్లోనే ఉండేలా దిశా నిర్దేశం చేస్తున్నారు. ఎమ్మెల్యేలకు పార్టీ నాయకత్వానికి ఎక్కడా గ్యాప్ రాకుండా చూసే బాధ్యతను పార్టీ సమన్వయ కర్తలకు అప్పగించనున్నారు.

అదే విధంగా ఇప్పటి లాగానే ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ సమస్యలను నేరుగా సీఎంఓకు సందేశం ఇచ్చే విధానం మరింత పటిష్ఠం చేయాలని భావిస్తున్నారు. త్వరలో ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనలు ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. పార్టీ సీనియర్లు గా ఉన్న ప్రాంతీయ సమన్వయకర్తలకు కీలక బాధ్యతలు అప్పగించటం ద్వారా రానున్న రోజుల్లో సీఎం జగన్ మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకొనే అవకాశం కనిపిస్తోంది.

### డ్రగ్స్ నుంచి బాలలను దూరం చేసేందుకు సంయుక్త కార్యాచరణ

ఎం.వెంకటేశ్వర్లు ద్వారా తెలుసుకున్నారు. దిశ యాప్ గురించి బాలికలు, మహిళలపై అత్యాచారాల నిరోధానికి దిశ యాప్ ద్వారా సాధిస్తున్న ఫలితాలపై డి.ఎస్.పి. వెంకటేశ్వర్లు వివరించారు.

నగరంలోని కొత్త ధర్మపురిలో వున్న ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం సందర్శించి బాలుర పరివర్తన, వారి పునరావాసానికి చేపడుతున్న చర్యలు, అబ్జర్వేషన్ హెూం ఏర్పాటుకు గల అవకాశాలపై పరిశీలన చేశారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేశలి అప్పారావు, జిల్లా రెవిన్యూ అధికారి ఎం.గణపతిరావు, మహిళాశిశు సంక్షేమశాఖ జిల్లా అధికారిణి శాంతకుమారి, డి.ఎస్.పి. వెంకటేశ్వర్లు, బాలల హక్కుల కమిషన్ జిల్లా అధ్యక్షురాలు హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

## సజావుగా పదో తరగతి పరీక్షలు



**విజయనగరం:** జిల్లాలో 127 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు తొలిరోజు 99.22 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి లింగేశ్వర రెడ్డి తెలిపారు. జిల్లాలో మొత్తం 24,255 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి వుండగా 24,067 మంది హాజరైనట్లు డి.ఇ.ఓ. వెల్లడించారు. 188 మంది పరీక్షలకు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. తొలిరోజు ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగాయని ఏ ఒక్క విద్యార్థి డిబార్ కాలేదని పేర్కొన్నారు. స్క్వాడ్‌లు 68 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశాయని, జిల్లా పరిశీలకులు, విద్యాశాఖాధికారి 16 కేంద్రాల్లో తనిఖీలు చేశారని తెలిపారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ.సూర్యకుమారి గంట్యాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి పరీక్షలు జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు.

## కాకినాడ జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** కాకినాడ జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ డా. కృతికా శుక్లా అన్నారు. సోమవారం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో తొలి నార్కో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్ బాబు, అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాస్, డీఆర్‌వో కె.శ్రీధర్‌రెడ్డి తదితరులతో పాటు రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ, ఔషధ, విద్య, వైద్యం, ఆరోగ్యం, అటవీ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. తొలుత అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఎన్‌డీపీఎస్ చట్టం-1985 పరిధిలో జిల్లాలో నమోదు చేసిన కేసులు, గంజాయి నిర్మూలన కార్యకలాపాలు, గంజాయి అక్రమ రవాణాపై నిఘా తదితరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ఉత్పత్తి, రవాణా, వినియోగం.. ఈ మూడు దశలపై సమన్వయ శాఖల అధికారులు పటిష్ట నిఘా పెట్టి జిల్లాలో గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషిచేయాలని సూచించారు. ఈ-క్రాప్ బుకింగ్ సమయంలో క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని.. ముఖ్యంగా సాగుచేయని భూముల్లో ఏమి పండిస్తున్నారో నిఘా పెట్టాలని సూచించారు. ప్రధానంగా సరిహద్దు మండలాలు, గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. గంజాయిని సాగు దశలోనే అడ్డుకోవాలన్నారు. ఆర్‌టీసీ.. కార్గో కార్యకలాపాలను నిశితంగా పరిశీలించాలన్నారు. మత్తు పదార్థాలు రవాణా జరక్కుండా కొరియర్ సేవల సంస్థలకూ అవగాహన కల్పించాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించాలని, ఎన్‌జీవోలను కూడా భాగస్వాములను చేయాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు అడ్డుకట్ట వేయడంలో జిల్లా పోలీసు శాఖ బాగా పనిచేస్తోందని.. ఇందుకు ఆ శాఖ అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి నెలా ఈ సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

**పరవర్తన కార్యక్రమంతో మంచి ఫలితాలు: ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు**

జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు మాట్లాడుతూ గంజాయి రహిత జిల్లాగా కాకినాడ జిల్లాను మార్చేందుకు పోలీసు శాఖ అమలుచేసిన పరివర్తన కార్యక్రమం మంచి ఫలితాలు ఇచ్చినట్లు తెలిపారు. 2014-18లో 101 గంజాయి కేసులను నమోదు చేయగా.. 259 మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. అదే విధంగా 2019-23లో 176 కేసులు నమోదుచేసి, 527 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. 2019 నుంచి నిఘాను పటిష్టం చేసిన విస్తృత స్థాయిలో ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టడం వల్ల అధిక కేసులు నమోదు చేయగలిగామని.. పెద్ద మొత్తంలో సీజ్ చేసి నిర్మూలించగలిగామన్నారు. ఏఎస్ఆర్, అనకాపల్లి జిల్లాల నుంచి కాకినాడ గుండా తెలంగాణ, మహారాష్ట్ర తదితర జిల్లాలకు గంజాయి రవాణా అవుతోందని తెలిపారు. డీఎస్పీల ఆధ్వర్యంలో విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక పోస్టర్ల ద్వారా ప్రజలకు మాదక ద్రవ్యాల వినియోగం దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలు, పాఠశాలలు, సచివాలయాలు తదితరాల్లో పోస్టర్లను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. జీజీహెచ్‌లో ప్రత్యేకంగా డీఅడిక్షన్, రిహాబిలిటేషన్ కేంద్రం పనిచేస్తోందన్నారు. సెబ్ టోల్‌ఫ్రీ నంబరు 14500, డయల్ 100/112 అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్‌డీవోలు బీవీ రమణ, జె.సీతా రామారావు డీఎస్పీలు అంబికా ప్రసాద్, కె.మురళీకృష్ణారెడ్డి, ఎస్.మురళీమోహన్, బి.అప్పారావు, డీఎఫ్‌వో ఐవీకే రాజు, డీఎంహెచ్‌వో డా. ఆర్.రమేష్, వ్యవసాయ అధికారి ఎన్.విజయ్‌కుమార్, డిప్యూటీ డీఈవో డేనియల్ రాజు, ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు.

## మాదక ద్రవ్యాల వాడకాన్ని అరికట్టాలి



**విజయనగరం:** మాదక ద్రవ్యాల వాడకాన్ని జిల్లాలో పూర్తిగా అరికట్టాలని, వీటి రవాణాపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. మాదక ద్రవ్యాలకు ఒక్కసారి అలవాటు పడితే, దానిలోనుంచి రావడం కష్టమని, అందువల్ల ముందే మేల్కోవాలని సూచించారు. మాదక ద్రవ్యాలను అరికట్టడం ఒక సామాజిక బాధ్యతగా ప్రతీఒక్కరూ పరిగణించాలని సూచించారు. నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం, తీరప్రాంత రక్షణపై వివిధ శాఖల అధికారులతో, మెరైన్ పోలీసు సిబ్బందితో కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం సమీక్షా సమావేశాలను నిర్వహించారు. వీటిపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మాదక ద్రవ్యాల వాడకాన్ని, రవాణాను అరికట్టడానికి ఒక పటిష్టమైన ప్రణాళికను రూపొందించాలని సూచించారు. వీటి బారిన పడితే యువత జీవితాలు నాశనం అవుతాయని, అందువల్ల వీటి వినియోగంవల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. దీనికోసం అన్ని ఉన్నత పాఠశాలలు, కళాశాలల వద్దా హోర్డింగులను ఏర్పాటు చేయాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించేందుకు, రవాణాను అరికట్టేందుకు 14500 తదితర టోల్ ఫ్రీ నెంబర్లను విద్యాసంస్థలతోపాటు, సచివాలయాల్లో కూడా ప్రదర్శించాలన్నారు. మాదక ద్రవ్యాలు, మద్యం, పొగాకు, గంజాయి, నాటుసారా, ఇతర మత్తును కల్గించే పదార్థాల అక్రమ వినియోగాలపై దృష్టి పెట్టాలని, బార్లు, మద్యం షాపులు వద్ద సిసి కెమేరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు దశలవారీగా సిసి కెమేరాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ పాఠశాలలను ఆనుకొని ఉన్న బడ్డీ షాపులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని డిఈఓను ఆదేశించారు. ముఖ్యంగా వసతి గృహాలపై దృష్టిపెట్టి, విద్యార్థుల అలవాట్లను గమనించాలని సూచించారు. మద్యానికి బానిస అయినవారికి, ఆ అలవాటును మాన్పించడానికి పరివర్తన శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని డి-అడిక్షన్ సెంటర్ లో అన్ని వసతులూ కల్పించి, ఈ సెంటర్ గురించి ప్రచారం చేయాలని చెప్పారు. బడిమానేసిన విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనుకాకుండా, వారికి ఏదో ఒక అంశంలో నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించాలని సూచించారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాల పట్ల ప్రజల్లో సంపూర్ణ అవగాహన కల్పించడమే, వీటి నియంత్రణకు మేలైన మార్గమని స్పష్టం చేశారు.

జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ మాట్లాడుతూ, మద్యం, మత్తు పదార్థాలు కూడా గృహ హింసకు ఒక కారణమని పేర్కొన్నారు. వీటిపై మహిళా పోలీసులచేత సర్వే నిర్వహించి, అవసరమైన వారిని డి-అడిక్షన్ సెంటర్‌కు పంపించి, చికిత్స చేయించాలని సూచించారు.

తీరప్రాంత రక్షణ పట్ల అప్రమత్తంగా ఉండండి

తీరప్రాంత రక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సూర్యకుమారి ఆదేశించారు. తీరప్రాంత రక్షణా చర్యలుపై మెరైన్ పోలీసు అధికారులతో సమీక్షించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. చింతపల్లిలోని మెరైన్ పోలీస్ స్టేషన్‌కు వెంటనే ప్రహరీ గోడ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. తీరంలో వాచ్ టవర్స్ నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని పంచాయితీరాజ్ అధికారులను ఆదేశించారు. సముద్రంలో చంపావతి నది కలిసే చోట కాజ్‌వే నిర్మాణానికి ప్రతిపాదన తయారు చేయాలన్నారు. తీర సంరక్షణా చర్యలపట్ల మత్స్యకారులకు అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సముద్ర తీరంలో ప్రమాద సమయంలో సందర్శకులను రక్షించేందుకు గజ ఈతగాళ్ల నియామకాన్ని పరిశీలిస్తామన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. జెట్టీ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశాల్లో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఓ ఎం.గణపతిరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీకర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జగనన్నే మా భవిష్యత్తు



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** వైఎస్సార్సీపీ ఈ నెల 7వ తేదీ నుండి 14 వరకు చేపట్టనున్న జగనాన్నే మా భవిష్యత్ కార్యక్రమం పై సోమవారం మండల పరిధిలోని సచివాలయం ల కన్వీనర్లు,గృహ సారథులు కు దిశా నిర్దేశం చేయడం జరిగింది.ఇందులో భాగంగా అడ్డాపు శిల, బాలగుడబ నర్సిపురం సచివాలయాలు పరిధిలో సచివాలయ కన్వీనర్లు గృహ సారథులు వైసీపీ నాయకులు వాలంటీర్లు కలిసి జగనన్నే మా భవిష్యత్తు అనే కార్యక్రమానికి మెటీరియల్ అంతాఎమ్మెల్యే గారి ఆదేశాల మేరకు అందజేయడం జరిగినది.7వ తేదీ నుండి మండలంలోని 20 సచివాలయాల పరిధిలో ప్రతి గ్రామంలో మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమాన్ని పండగల జరపాలని ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న ప్రభుత్వంలో జరిగిన సంక్షేమాన్ని గుర్తుచేస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ గత ప్రభుత్వంలో జరిగిన మోసాలను వివరిస్తూ జగనన్న ప్రభుత్వానికి మద్దతు కూడగట్టే విధంగా గృహ సారథులు కన్వీనర్లు వాలంటీర్లు పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బొమ్మి రమేష్ గారు, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, జడ్పిటిసి ప్రతినిధి బలగ నాగేశ్వరరావు , JCS కన్వీనర్ బంకపల్లి వాసుదేవరావు, చిన్న బొండ పల్లి ఎంపిటీసీ బంకూర్ రవికుమార్, సీనియర్ నాయకులు కాపారపు సత్యనారాయణ , వేంపల గుర్రాజు పాల్గొన్నారు.

**పంచాంగం**

ఆదివారం 04-04-2023
శోభకృత్ నామ సంవత్సరము
ఉత్తరాయణం వసంత రుతువు
చైత్ర మాసం

తిథి : శు. త్రయోదశి ఉ. 07.32
నక్షత్రం : పుబ్బ ఉ. 09.22
వర్జ్యం : రా. 08.04 ల 09.45



సమస్యలతో సతమతమవడం కంటే సాధకుల సహాయం కోరుట మేలు.
బ్రహ్మశ్రీ హనుమద్దాస్ స్వామీజీ గారు ప్రస్తుతం చెన్నైలో ఉన్నారు.
సెల్ : 9440537607

## నేడు గ్రూప్ 4 పరీక్ష

**విజయనగరం:** ఎపిపిఎస్సీ ద్వారా రెవిన్యూ డిపార్ట్ లో నిర్వహించనున్న జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ అసిస్టెంట్ పోస్ట్ లకు కంప్యూటర్ బేస్డ్ మెయిన్ పరీక్ష నేడు (4 వ తేదీన) నిర్వహిస్తున్నట్లు డి.ఆర్.ఓ గణపతి రావు తెలిపారు. జిల్లాలో రాజం జి.ఎం.ఆర్ , అయాన్ డిజిటల్ జోన్, గాజులరేగ, సీతం కాలేజీ లలో 3 కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఈ పరీక్ష రెండు పూటల ఉదయం 9.30 నుండి 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుండి 5 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఈ పరీక్ష కోసం 3 కేంద్రాల్లో కలిపి 1780 మంది అభ్యర్ధులు హాజరుకానున్నారని తెలిపారు. సోమవారం డి.ఆర్.ఓ అయన ఛాంబర్ లో పరీక్ష నిర్వహణకు అవసరమగు ఏర్పాట్ల పై సంబంధిత అధికరులతో సమావేశం ఏర్పాటు చేసారు. పరీక్షా కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ ఉండేలా చూడాలని విద్యుత్ అధికారులకు , మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలనీ వైద్య శాఖ అధికారులకు , బందో బస్త ఏర్పాటు చేయాలనీ పోలీస్ శాఖ వారికీ ఆదేశించారు. అభ్యర్ధులు పరీక్ష కేంద్రం లోనికి మొబైల్ ఫోన్లు, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకు వెళ్లకూడదని స్పష్టం చేసారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పరీక్షలు నిర్వహిస్తోందని, ఎలాంటి అజాగ్రత్త వహించకుండా అధికారులంతా సమన్వయంగా వ్యవహరించాలని అన్నారు. ముగ్గురు లైసన్ అధికారులను ఈ పరీక్ష కోసం నియమించామని, చీఫ్ సూపరింటెండెంట్ లతో కలసి పరీక్ష ప్రశాంతంగా జరిగేలా చూడాలని డి.ఆర్.ఓ తెలిపారు. ఈ సమావేశం లో సంబంధిత శాఖల అధికారులు, ఎపిపిఎస్సి ప్రతినిధులు పాల్గొన్నారు.

### మత్తు, మాదక ద్రవ్యాలపై నిఘా ఉండాలి



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో మత్తు, మాదక ద్రవ్యాలపై పటిష్ఠమైన నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. మాదక ద్రవ్యాల జాడ్యం సమాజంలో పెరుగుతుందని, ఆదిలోనే అరికట్టాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాల నియంత్రణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన సోమ వారం జరిగింది. మత్తు, మాదక ద్రవ్యాలు యువతను అన్ని విధాలా నిర్వీర్యం చేస్తుందని ముఖ్యంగా పెద్ద నగరాల్లో ప్రమాదకర స్థాయిలో ఉందని ఆయన తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన ఆరోగ్య ప్రమాదాలు, చట్టపరంగా పడే శిక్షలపై అవగాహన లేకపోవడం వంటి అంశాల వలన మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారని ఆయన చెప్పారు. యువత మానసిక బలహీనతకు లోను అవుతున్నారని, తద్వారా సమాజంలో నేరాలకు అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. వీటిపై నియంత్రణ పక్కాగా ఉండాలని, విద్యా సంస్థలలో అధిక సంఖ్యలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. అనాలోచిత నిర్ణయాల వలన భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని, కుటుంబాలు తీవ్ర మనోవేదనకు గురి అవుతున్నాయని ఆయన అన్నారు. విద్యా శాఖ కీలక పాత్ర పోషించి యువత చెడు మార్గాలు పట్టకుండా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. కొండ శిఖరాలపై గంజాయి వంటి మాదక ద్రవ్యాల పంటలపై నిఘా ఉండాలని, వాటి వెనుక ఎవరి హస్తం, ప్రోత్సాహం ఉందో గుర్తించాలని ఆయన అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణా తదితర ఏ రూపంలో ఉన్న తీవ్రమైన నేరంగా పరిగణించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. కనీసం ఏడు సంవత్సరాల వరకు జైలు శిక్ష పడుతుందని ఆయన అన్నారు. కేసులు నమోదు పక్కాగా ఉండాలని ఆయన ఆదేశించారు. ప్రతి ఒక్కరూ గమనించాలని, సమాజంలో మాదక ద్రవ్యాలకు అవకాశం లేకుండా చూడాలని అన్నారు. బడి, గుడి వంటి ప్రదేశాల్లో కూడా నిఘా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఆర్థిక పరమైన వెనుకబాటుతో ఇటువంటి పంటలు ఎవరైనా పండిస్తూ ఉంటే వారికి ఆదాయాన్ని కల్పించే పంటల విత్తనాలు అందించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. మత్తు పదార్థాల వినియోగం నియంత్రించే డీ ఎడిక్షన్ కేంద్రాలు, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. రవాణా వ్యవస్థ పై నిఘా ఉందని, 2 లక్షల మెట్రిక్ టన్నుల మత్తు పదార్థాల పంటను గత ఏడాది నాశనం చేశామని ఆయన వివరించారు.ఈ సమావేశంలో అదనపు పోలీసు సూపరింటెండెంట్ డా. ఓ. దిలీప్ కిరణ్, జిల్లా అటవీ అధికారి జి.ఏ.పి ప్రసూన, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. బగాది జగన్నాథ రావు, జిల్లా డ్రగ్ కంట్రోల్ అధికారి ఏ.లావణ్య, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పి. సూర్య నారాయణ, విద్యాశాఖ సహాయ సంచాలకులు వెంకటేశ్వర రావు, పోలీసు ఇన్స్పెక్టర్ శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణా చర్యలు భేష్



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణకు తీసుకున్న చర్యలు అభినందనీయమని, నేషనల్ కౌన్సిల్ ఫర్ ప్రొటెక్షన్ అఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్సిపిసిఆర్) సభ్యులు డాక్టర్ ఆర్.జి.ఆనంద్ అన్నారు. సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనకు కలెక్టరేట్ వద్ద జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున స్వాగతం పలికారు. అనంతరం కలక్టరేట్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణకు తీసుకున్న చర్యలను వివరించారు. బాల్య వివాహాల నిర్మూలనపై దృష్టి పెట్టామని, దీనిపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. బాల్యవివాహాలకు సిద్ధపడిన తల్లితండ్రులకు అవగాహన కల్పించి, వాటిని ఆపివేయిస్తున్నామని అన్నారు. ముఖ్యంగా బాలికా విద్యకు ప్రాధాన్యత ఇస్తూ, బాలురతో సమానంగా బాలికలు కూడా డిగ్రీ లేదా ఇతర ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ చైర్ పర్సన్ ప్రియాంక్ కనూంగొ ఆదేశాలతో 5 రాష్ట్రాలలో తమిల్ నాడు, పుదుచెర్రి, కేరళ, ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ లో పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఎన్సిపిసిఆర్ కనుగొన్న మాసి యాప్ ను వినియోగంలో తీసుకువచ్చి త్వరగా తనిఖీలు చేయాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చాలా రకాల కొత్త పథకాలను ప్రవేశ పెడుతున్నారని, అదే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పథకాలను అమలు చేయడం చాలా బాగుందన్నారు.

ఈ సమావేశంలో డిఆర్ఓ శ్రీనివాసమూర్తి, మాతా శిశు సంక్షేమ శాఖ పిడి వెంకటేశ్వరి, ఐ సి డి ఎస్ సిబ్బంది, డి సి పి తదితరులు పాల్గొన్నారు.

## రక్త హీనత లోపం ఉన్నవారి ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): రక్తహీనత లోపం ఉన్న గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి, వారికి సరైన పోషకాహారం అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఎస్ విశ్వనాథన్ పేర్కొన్నారు.

సోమవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మాతా శిశు సంక్షేమ శాఖ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు ఎనీమియా (రక్తహీనత లోపం) బారిన పడకుండా ఉండేందుకు, బాలింతలకు, చిన్నపిల్లలు బరువు తక్కువ ఉండడం, చురుకుదనం, ఎదుగుదల లోపం శాతాన్ని తగ్గించడానికి అంగన్వాడీ కేంద్రాల ద్వారా సరైన పోషకాహారాన్ని అందించాలని అన్నారు. సచివాలయ వాలంటీర్ల సహాయంతో తమ పరిధిలో ఉన్న ప్రతి గర్భిణీ మహిళను నమోదు చేయాలన్నారు . రక్తహీనత లోపం కలిగిన గర్భిణీ స్త్రీలకు అవసరమైన మందులు అందించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ప్రతి నెల క్రమం తప్పకుండా తక్కువ బరువు ఉన్న, తక్కువ ఎత్తు ఉన్న వారి పట్ల శ్రద్ధ కనబరచాలని తెలిపారు. వ్యాధి నిరోధక టీకాలు వంద శాతం ఇవ్వాలని, తల్లులు తమ పిల్లలకు తల్లి పాలు అందించే విధంగా వారికి అవగాహన కల్పించాలని అన్నారు. గర్భిణీ స్త్రీలకు ఖచ్చితంగా 12 శాతం కంటే హిమోగ్లోబిన్ ఉండేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు ఇచ్చే ఎంసీపీ కార్డులోని చివరి పేజీలో గల సూచనలను అర్థమయ్యేలా వివరించాలని, ఐరన్ , ఫోలిక్ యాసిడ్ ట్యాబ్లెట్లు వేసుకునేలా చూడాలని సూచించారు. సచివాలయ మహిళా పోలీస్ సిబ్బంది ద్వారా గర్భిణీ మహిళలు తీసుకుంటున్న పోషకాహారం , మందులు వివరాలు మోనిటర్ చేయాలన్నారు.

ఈ సమీక్షలో జిల్లా మాతా శిశు సంక్షేమ శాఖ పి డి వెంకటేశ్వరి ,ఐ సి డి ఎస్ సిబ్బంది, సి డి పీ వోలు , సూపర్వైసర్లు తదితరులు పాల్గొన్నారు.

## మే 15 నాటికి సర్వే రాళ్ళు



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): జిల్లాలో రీ సర్వే పూర్తి అయిన గ్రామాల్లో మే 15 నాటికి సర్వే రాళ్ళు పాతాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. డివిజన్, మండల అధికారులతో సోమ వారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ లో పలు అంశాలను సమీక్షించారు. సర్వే రాళ్ళపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. గృహ నిర్మాణాలు ఏప్రిల్ 15 నాటికి పూర్తి చేయాలని, డివిజనల్, మునిసిపల్ ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ పక్కాగా ఉండాలని ఆయన అన్నారు. మానస సరోవరం పనులు వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. మేజిక్ సాక్ పిట్స్ పై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్ర రావు, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రఘురాం, జిల్లా గ్రామ పంచాయితీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె. రాజ కుమార్, విద్యా శాఖ సహాయ సంచాలకులు వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# 450 కోట్లతో రాష్ట్రంలో 10,960 డిజిటల్ లైబ్రరీలు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): రాష్ట్రంలో రూ.450 కోట్లతో 10,960 డిజిటల్ లైబ్రరీలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు ప్రకటించారు. శ్రీ గౌరీ గ్రంథాలయంలో 'గ్రంథాలయాలు-సాంకేతిక పరిజ్ఞానం' అంశంపై జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కడపలో మొదటి డిజిటల్ లైబ్రరీ ఏర్పాటైందని, అన్ని జిల్లాల్లో దశల వారీగా నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. గ్రంథాలయాల్లో సాంకేతిక భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక సంస్థలు పన్ను చెల్లింపుదారుల నుంచి వసూలు చేస్తున్న గ్రంథాలయ సెస్‌తో రాష్ట్రంలోని గ్రంథాలయ పురోగాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ ఉగాదిని 'జగన్ డిజిటల్ శోభకృత నామ సంవత్సరం'గా గ్రంథాలయ పరిషత్ తరుపున నామకరణం చేశామన్నారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో ఏప్రిల్ 5 నుండి 'విజనరీ జగన్' పేరుతో సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో గ్రంథాలయాల్లో పుస్తకాల కొనుగోలుకు రూ.15.75 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని, ఇప్పటి వరకు రూ.10 కోట్లతో పుస్తకాలను కొనుగోలు చేసి గ్రంథాలయాలకు అందజేశామన్నారు. గత ప్రభుత్వాలు గ్రంథాలయ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశాయని, పదేళ్లుగా ఒక్క పుస్తకం కూడా కొనుగోలు చేయకపోవడమే నిదర్శమని ఆయన ఆరోపించారు. 'యువత-భవిష్యత్-వైఎస్ ఆర్ డిజిటల్ లైబ్రరీ' అంశం ఇతివృతంగా ప్రత్యేక సంకలనంకు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ శ్రీకారం చుట్టిందని శేషగిరిరావు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

గ్రామాలకు విజ్ఞాన వీచికలు అందాలన్న లక్ష్యంతో దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేసామన్నారు. పేదోళ్లకు విద్య, విజ్ఞానాన్ని అందించాలన్న లక్ష్యంతో విద్యాశాఖలో పలు సంస్కరణలు తీసుకువచ్చిన ఘనత సీఎం వై.ఎస్.జగన్మోహన్ రెడ్డికు దక్కిందన్నారు. గ్రంథాలయాల పురోభివృద్ధే లక్ష్యంగా పరిషత్ పనిచేస్తుందన్నారు.

జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్, ఏపీ వైద్య విధాన పరిషత్ జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ పేరాల శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ శ్రీ గౌరీ గ్రంథాలయం డిజిటల్ లైబ్రరీ ద్వారా కొన్నేళ్లుగా విద్య, విజ్ఞానం అందించడం అభినందనీయమన్నారు. గ్రంథాలయాలతోనే పురాతన సంస్కృతి, సంప్రదాయం, మేధోసంపత్తి, ఉజ్వల భవిష్యత్తు, మానవ పురోభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. యువత, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగపరచుకోవాల్సిన ప్రాముఖ్యత గురించి ఆయన వివరించారు. కోవిడ్-నేపథ్యంలో డిజిటల్ వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యత చేకూరిందని శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్, ఎన్‌వైకే జిల్లా యువజన అధికారి జి. మహేశ్వరరావులను గ్రంథాలయం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో గ్రంథాలయ అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, కోశాధికారి బీశెట్టి కృష్ణఅ-ప్పారావు, సభ్యులు బొడ్డేడ జగ్గఅప్పారావు, కాండ్రేగుల సత్యనారాయణ (ఎస్.ఎఫ్.ఐ), కర్రి గంగాధర్, మళ్ల బాపునాయుడు, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పుస్తక నిక్షిప్త%--%డీబీసీ కేంద్రం జిల్లా అధ్యక్షుడు సానుబిల్లి మహాలక్ష్మినాయుడు పెద్ద సంఖ్యలో మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం వారు గ్రంథాలయంలో ఉన్న సాహిత్యం, నవలలు, చరిత్ర పుస్తకాలు, పత్రికలు, పోటీ పరీక్షలు, కంప్యూటర్ విభాగాలను వారు పరిశీలించారు.

## సబ్ రిజిస్టర్ కార్యాలయం తరలింపు తగదు- తెలుగుదేశం పార్లమెంట్ కమిటీ సభ్యులు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి జిల్లా సబ్ రిజిస్టర్ కార్యాలయం గ్రామీణ ప్రాంతానికి తరలించడం అన్యాయమని కేవలం కాసులకు కక్కుర్తి పడి అందరికీ అందుబాటులో ఉండే విధంగా నడుస్తున్న కార్యాలయాన్ని అర్ధాంతరంగా తరలించడం పట్టణ ప్రజలను ఆశ్చర్యపరిచిందని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కమిటీ సభ్యులు కొట్ని రామకృష్ణ మల్ల గణేష్ సూరే సతీష్ తీవ్రంగా విమర్శించారు. సబ్ రిజిస్టర్ కార్యాలయం కి సొంత భవనం ఉన్నప్పటికీ శిథిలావస్థలో వరదల్లో దెబ్బతినడం పడిపోయే పరిస్థితిని గమనించి తెలుగుదేశం ప్రభుత్వం మూడున్నర కోట్ల రూపాయలు మంజూరు చేస్తే వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత దాని నిర్మాణం చేపట్టకపోవడం ఆ నిధులు దారి మళ్లించడం జరిగిందని వారు ఘాటుగా విమర్శించారు. స్థానిక శాసనసభ్యులు జిల్లా మంత్రి గుడివాడ అమర్నాథ్ మాటలు చూస్తే కోటలు దాటుతున్నాయని అడుగులు చూస్తే గడప కూడా దాటడం లేదని, అనకాపల్లి జిల్లాగా ప్రకటించిన తర్వాత కూడా కనీసం అనకాపల్లికి సబ్ రిజిస్టర్ కార్యాలయం, కోర్టు, తాహసిల్దార్ కార్యాలయం పునర్నిర్మాణం నోచుకోవడం లేదని వాటి మీద కూడా శ్రద్ధ లేకుండా స్వప్రయోజనాల కోసం భూములు ఆస్తులు పోగేసుకుంటున్నారని అభివృద్ధిని గాలికి వదిలేసారని ఇతని అసమర్థత వల్ల పట్టణ ప్రజలకు బురద నీరు అందిస్తున్న జీవీఎంసీపై కనీసం కళ్ళుండి చూడలేక చెవులు ఉండి వినలేక నోరు ఉండి మాట్లాడలేని పరిస్థితి మనం చూస్తున్నామని ఇంత దౌర్భాగ్యమైన పరిస్థితి అనకాపల్లి చరిత్రలో ప్రజలు ఏనా డు చూడలేదని వైసీపీని గెలిపించిన తర్వాత ప్రజలకు ఇటువంటి పరిస్థితి దాపరించిందని రామకృష్ణ గణేష్ సురేష్ అన్నారు. ఇప్పటికైనా శాశ్వత ప్రాతిపదిక మీద సబ్ రిజిస్టర్ కార్యాలయం, జిల్లా కోర్టు, తాహసిల్దార్ కార్యాలయం, నిర్మాణాలు చేపట్టకపోతే తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలుగుదేశం పార్టీ శ్రేణులు అమర్నాథ్ ను హెచ్చరించారు. ఈరోజు ఉదయం రింగ్ రోడ్ లో ఉన్న జిల్లా రిజిస్టర్ కార్యాలయంలో సూపర్ండెంట్ కు వినతిపత్రం అందజేసి తక్షణమే సమస్యను పరిష్కరించి కచ్చిదారులకు మేలు చేకూరే లాగా చర్యలు తీసుకోవాలని కోరారు. బుద్ధ భువనేశ్వరరావు సాలాపు నాయుడు కొట్ని రాంబాబు కేబుల్ రమేష్ షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఎం ఏఏ హై స్కూల్ 1973 ఎస్ఎస్.సి విద్యార్థుల ఆత్మీయ సమావేశం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): స్థానిక ఏఎం ఏ ఏ హై స్కూల్ 1973 సంవత్సరం పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులుఆదివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దనున్న వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ భవనంలో స్వర్ణోత్సవాలు సందర్భంగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 40 మంది విద్యార్థులు ఈ సమావేశంలో పాల్గొని తమకు విద్య నేర్పిన గురువులు ఎల్ ఎన్ శాస్త్రి, వెంకట రాజులను దుస్సాలువలతో ఘనంగా సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు మాట్లాడుతూ తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల రుణం తీర్చుకోవాలని ఉద్దేశంతో గత రెండు సంవత్సరాలుగా పాఠశాలకు 2 లక్షల 30 వేల రూపాయల ఫర్నిచర్ ను అందజేశామని తెలిపారు. పాఠశాల క్రమశిక్షణకు మారుపేరని ఉత్తమ ఉపాధ్యాయుల శిష్యరికంలో విద్యను అభ్యసించామని తమ అభ్యున్నతికి కారకులైన గురువులను జీవితాంతం తమ హృదయాలలో గుర్తుంచుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా మిత్రులు ఒకరినొకరు క్షేమ సమాచారాలు తెలుసుకొని, పాఠశాల తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఇలాగే ప్రతి సంవత్సరం ఒక పండగల ఆత్మీయ సమావేశాలు నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. గురునాధరావు పాండురంగ, దొడ్డి వెంకట సత్యనారాయణ (బాబు), బుద్ధ రామకృష్ణ సుధాకర్ శంకరనారాయణ, తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

## వైభవంగా వరహా లక్ష్మీ నృసింహస్వామి కళ్యాణ మహోత్సవం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): పట్టణంలోని గవరపాలెం, దిబ్బ వీధి లో వేంచేసి ఉన్న శ్రీ వరాహలక్ష్మి నృసింహ స్వామి వారి కళ్యాణం ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. అనకాపల్లి వైసీపీ పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్ అచ్యుత దంపతుల చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు. రత్నాకర్ దంపతులు ముందుగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వివిధ రకాల పూల పూల అలంకరణతో అందంగా తీర్చిదిద్దిన కళ్యాణం మండపం పై స్వామివారి కల్యాణం కన్నుల్లో పండుగ జరిగింది. పదిమంది జంటలు కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారి కల్యాణం సందర్భంగా ఆలయ ప్రాంగణం విద్యుత్ దీపాలంకరణతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో భాగంగా స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న కోలాటం కళాకారులు అయినా మహిళలకు రత్నాకర్ దంపతుల చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. ఆలయ నిర్వాహకులు మల్ల రామచంద్ర రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 81 వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మి సౌజన్య రాంబాబు, 80 వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్, శిలపరశెట్టి బాబి, కాండ్రేగుల శ్రీరామ్, దాడి ఈశ్వరరావు, మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## నూకాంబిక ఆలయానికి భారీగా తరలివచ్చిన భక్తులు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): ప్రముఖ పుణ్యక్షేత్రం అనకాపల్లి గవరపాలెం లో వెలిసిన శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర తర్వాత రెండవ ఆదివారం సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారిని



దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. క్యూ లైన్ లో ఉన్న భక్తులకు మజ్జిగ, త్రాగునీరు పంపిణీ చేశారు, బాలింతలకు ఆలయం వద్ద పిల్లలకు పాలిచ్చేందుకు ప్రత్యేకంగా ఒక గది తయారు చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎన్ సుజాత, ఆలయ ఈవో బండారు ప్రసాద్, భక్తులు, పట్టణ సీఐ దాడి మోహన్ రావు ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తుఏర్పాటు చేశారు.

## అంగన్వాడి కేంద్రాల్లో హెల్త్ షో కార్యక్రమం : ముఖ్యఅతిథిగా ఎంపీపీ



పరవాడ, (విశాఖ సమాచారమ్): అంగన్వాడి కేంద్రాల్లో పోషన్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ సబ్బవరం ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో పరవాడ అంగన్వాడి కేంద్రాలు పరిధిలో హెల్త్ బేబీ షో కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీపీ పైల వెంకట పద్మా లక్ష్మీ శ్రీనివాసరావు లిపోషన్ పక్వాడలిలో భాగంగా ఏర్పాటు చేసిన పౌష్టికాహారం ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బాలింతలు గర్భిణీలు, పిల్లలు కోసం ఎంతో ఖర్చు పెట్టి పౌష్టికాహారాన్ని సరఫరా చేస్తుందని అందువలన ప్రతి ఒక్క లబ్ధిదారులు పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు బాల్యవివాహాలు జరగకుండా తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. అంగన్వాడి కేంద్రం ద్వారా సరఫరా చేస్తున్న పోర్ట్ ఫైడ్ రైస్ ను లబ్ధిదారులందరూ వినియోగించుకోవాలన్నారు రక్తహీనత లేకుండా చూసుకోవాలని అన్నారు . రాగులు, జొన్నలు తదితర చిరు ధాన్యాలతో తయారు చేసిన వంటకాలను ఆసక్తి గా తిలకించారు. ఆరోగ్యవంతమైన పిల్లలకు వెల్ బేబీ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిరిపురపు అప్పల నాయుడు, ఉప సర్పంచ్ బండారు రామరావు, పెందుర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పైల అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి అచ్చుతరావు, వై.సి.పి నాయకులు చీపురుపల్లి శ్రీనివాసరావు, పైల పైడం నాయుడు, అంగనవాడి టీచర్లు, ఏఎన్ఎం లు ఇందిర, రత్నం, బాలింతలు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభించిన రత్నాకర్



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): ఉత్తరాంధ్ర ప్రజల ఇలువేల్పు అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని వైసిపి పార్లమెంట్ పార్టీ పరిశీలకులు దాడి రత్నాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలు వచ్చే భక్తులకు దాహం తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్చార్జ్ కొణతాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పరిష్కారం దిశగా స్పందన దరఖాస్తులు



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** స్పందన కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఓ.ఆనంద్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకట రావు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు 80 దరఖాస్తులు స్పందన కార్యక్రమంలో అందాయి.

అర్జీలు వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

పార్వతీపురం మండలం కొత్తవూరు గ్రామంలో ఉన్న ప్రభుత్వ స్మశాన వాటిక అక్రమణకు గురయినందున రీ సర్వే జరిపించి స్మశాన భూమికి రక్షణ కల్పించగలరని హెచ్.సాదరం, ఇతరులు వినతి పత్రం సమర్పించారు.

భామిని మండలం నులకజోడు గ్రామంలోపలికి అనగా వంశధార రిజర్వాయర్ కాలువకు ఆనుకుని ఉన్న రహదారి సుమారుగా 2 కి.మీ. కలదు వర్షం పడటం వలన రాకపోకలు సాగించడానికి ఇబ్బందిగా ఉందని ప్రధాన రహదారి మంజూరు చేయవలసిందిగా, భామిని గ్రామపంచాయతీ పరిధిలో ఎస్ బి ఐ బ్రాంచ్ ఏర్పాటు చేయవలసిందిగా కే.ప్రసాద్, గ్రామస్తులు దరఖాస్తు అందజేశారు.పార్వతీపురం మండలం కొత్తవూరు గ్రామానికి చెందిన హెచ్.సంగయ్య మారుమూల గ్రామాలకు తమ్మన్నదొరవలస, మాదాపురం, కొనవలస,బొడ్డవలస జియో మొబైల్ టవర్ ఏర్పాటు చేయాలని కోరారు.కొమరాడ మండలం గాజులు గూడా గ్రామానికి చెందిన కే.మల్లేశ్వరరావు కెమిశీల గ్రామం నుండి గాజులుగూడా గ్రామానికి రహదారి నిర్మించాలని కోరారు.సాలూరు మండలం కొత్తవలస, దాగర వలస గ్రామాలకు గత 20 సంవత్సరాల నుండి రోడ్డు సదుపాయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గదభ బొడ్డవలస నుండి ఎగువ దాగరవలస వరకు రోడ్డు ఏర్పాటు చేయవలసిందిగా ఎస్.జైసింహ కోరారు.సీతంపేట మండలం తాడిపాయి పంచాయితీ పరిధిలో ఉన్న గ్రామాలకు సిసి రోడ్ మంజూరు చేయాలని కే.సరోజినీ,ఇతరులు దరఖాస్తు అందజేశారు.గరుగుబిల్లి మండలం పిట్టల మెట్ట గ్రామానికి చెందిన ఎం. నారాయణరావు మూడు సంవత్సరములుగా గోసాలలు బిల్లులు రావడం లేదని అర్జీ అందజేశారు.సాలూరు మండలం జిల్లేడు వలస గ్రామానికి చెందిన సిహెచ్ లచ్చమ్మ పి.టి.జి గొర్రెలు లోను మంజూరు చేయవలసిందిగా కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి.జగన్నాథ రావు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్ కుమార్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎం.వి.జి.కృష్ణాజి, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్ర రావు, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయ అధికారి వి.చిట్టి బాబు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, జిల్లా సరఫరా అధికారి కె.వి.ఎల్.ఎన్ మూర్తి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా పశు సంవర్ధక అధికారి ఏ. ఈశ్వర రావు, జిల్లా విద్యా శాఖ అధికారి డా.ఎస్.డి.వి రమణ, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఉరిటి సాయి కుమార్, జిల్లా ప్రణాళిక అధికారి పి. వీర రాజు తదితరులు పాల్గొన్నారు.

# స్పందన కార్యక్రమానికి 199 వినతులు



**విజయనగరం:** జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 199 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 140 ఉన్నాయి. హౌసింగ్ కు 12, మున్సిపల్ శాఖ కు 06, వైద్య శాఖ కు 3, డి.ఆర్.డి.ఏ కు 17 కాగా మిగిలినవి ఇతర శాఖలకు చెందిన వినతులు . పింఛన్ల కోసం, రేషన్ కార్డుల జారీ, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు ఇతర సమస్యలపై మిగిలిన వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి, జె.సి మయూర్ అశోక్, డి.ఆర్.ఓ గణపతి రావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు పద్మలత, సూర్యనారాయణ, పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాలలో పరిష్కారం జవాల్సిన అనేక వినతులు జిల్లా స్థాయి కి వస్తున్నాయని, సచివాలయ సిబ్బందికి మరో సారి శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. నియోజక వర్గం స్థాయి లో ఎం.పి.డిఓ ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహించాలన్నారు. సంబంధిత శాఖ హెహెచ్.ఓ.డి ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని శాఖా పరమైన అంశాల పై అవగాహన కలిగించాలన్నారు. అందుకోసం హెచ్.ఓ.డి లు ఒక కామన్ పిపిటి ని తయారుచేసుకొని అన్ని చోట్లా అదే అంశాలలో అవగాహన కలిగించాలన్నారు. ముఖ్యముగా సిసిఏ రూల్స్, అడ్మినిస్ట్రేషన్, కరెస్పాండెన్స్, ప్రభుత్వ పథకాల అమలు, ఫైలింగ్, బాధ్యతలు, స్పందన వినతులు , సమయపాలన, యూనిఫామ్ ప్రాముఖ్యత వంటి విషయాల పై అవగాహన కలిగించాలన్నారు.

# పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** గరుగుబిల్లి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సోమ వారం తనిఖీ చేశారు. పదవ తరగతి పరీక్షలు సోమ వారం నుండి ప్రారంభం అయిన సంగతి విదితమే. విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 18వ తేదీ వరకు పదవ తరగతి పరీక్షలు జరుగుతాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. పరీక్షలు మొత్తం 8 రోజులు జరుగుతాయని, ప్రతి రోజూ ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతుందని ఆయన వివరించారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్.టి.సిలో ఉచిత ప్రయాణం ఉందని ఆయన పేర్కొన్నారు. అన్ని రూట్ లలో ఆర్.టి.సి బస్సులను విధిగా నడపాలని ప్రజా రవాణా అధికారిని ఆదేశించామన్నరు. జిల్లాలో 64 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, 210 పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని ఆయన చెప్పారు. 5,272 మంది బాలురు, 5,442 మంది బాలికలు రెగ్యులర్ విద్యార్థులుగా, 70 మంది ప్రైవేట్ విద్యార్థులు వెరసి 10,784 మంది విద్యార్థులు జిల్లాలో పరీక్షలు రాస్తారని ఆయన అన్నారు. ఏపి ఓపెన్ స్కూల్ పదవ తరగతి పరీక్షలకు 6 కేంద్రాలు, ఇంటర్ పరీక్షలకు 2 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని అందులో 751 మంది పదవ తరగతి, 479 మంది ఇంటర్ పరీక్షలు రాస్తారని ఆయన చెప్పారు. 650 మంది ఇన్విజిలేటర్లను, 12 మంది రూట్ అధికారులను, 3 ఫ్లయింగ్ స్క్వాడ్ లను నియమించామని వివరించారు. పరీక్షా కేంద్రాలకు కిలో మీటర్ దూరం పరిధిలో జెరాక్స్ దుకాణాలు మూసి వేయాలని ఆయన ఆదేశించినట్లు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేసామని జిల్లా కలెక్టర్ అన్నారు.

# లూథరన్ చర్చిలో ఘనంగా మట్టల ఆదివారం




**పిఠాపురం, (విశాఖ సమాచారమ్):** ంవరెండ్ ప్రేమనాథ్ ఆధ్వర్యంలో చిట్టోడు తోటలో గల త్రినేటి లూథరన్ చర్చ్ సంఘ సభ్యులు మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు ఎరుషలేము జయప్రవేశం చేసిన రోజుగా క్రైస్తవులు చాలా ఘనంగా నిర్వహించుకుంటారని ఈత మట్టలను చేతబట్టి ఊరేగింపుగా తమ ప్రార్థనతో ఆయన మీద ఉన్న ప్రేమను విశ్వాసం చాటుకుంటారని అన్నారు. సంఘ సభ్యులు ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు.

# తెలుగు రచయిత పండితుడు అబ్బూరి రామకృష్ణారావు వర్ధంతి (ఏప్రిల్ 4)



అబ్బూరి రామకృష్ణారావు ఆధునిక ఆంధ్ర సాహిత్యానికి మార్గదర్శకుడు. బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలుగు భావకవి, పండితుడు, నవలా రచయత, నాటక కర్త, సాహితీవేత్త, విమర్శకుడు, అభ్యుదయ భావాలున్నవాడు, మానవతావాది, గ్రంథాలయ శాస్త్ర అచార్యుడు, గ్రంథాలయాధికారి. ఆధునిక ఆంధ్ర సాహిత్యానికి గురజాడ అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు, అబ్బురి రామకృష్ణారావులను కవిత్రయమని పేర్కొంటారు. ఆధునిక కవిత్వానికి ముగ్గురూ మార్గదర్శకులే కాక వారి రచనలు ఒకే కాలాన ప్రచురితం అయ్యాయి. అబ్బూరి జీవితంలో ప్రతి అడుగూ మిత్రుల సాంగత్యం, సాహిత్యం తోటే ముడిపడి ఉంది.

రామకృష్ణారావు గుంటూరు జిల్లా తెనాలి తాలూకాలోని అనంతవరం గ్రామంలో లక్ష్మీనరసింహశాస్త్రి, బాపమ్మ దంపతులకు 1896, మే 20 న జన్మించారు. వారిది పండిత వంశం. తాతగారు కవి. తండ్రి సంస్కృతాంధ్రాలలో పండితుడు. ఆయన చిన్నతనంలో తిరుపతి వెంకట కవులలో ఒకడైన చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి తరచుగా అబ్బూరి తండ్రి గారి ఇంటికి వస్తుండేవాడు. అబ్బూరి కూడా బహుభాషా కోవిదుడు. సంస్కృతం, తెలుగు, ఆంగ్లము, బెంగాలీ, పర్షియన్ సాహిత్యాలను క్షుణ్ణంగా చదివిన వారు. 15వ ఏటనే వారికి మేనమామ కుమార్తె రుక్మిణితో వివాహం అయింది. వీరికి నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు స్వర్గీయ అబ్బూరి గోపాలకృష్ణ, చిత్రకారుడు, అనేక కళా సంస్థలతో అనుబంధం ఉన్నవాడు. ఈయన అనేక కీలక పదవులు నిర్వహించి, ఆంధ్ర విశ్వవిద్యాలయం థియేటర్ ఆర్ట్స్ విభాగాధిపతిగా పదవీవిరమణ కావించారు. రెండవ కుమారుడు స్వర్గీయ అబ్బూరి వరదరాజేశ్వరరావు రచయత, విమర్శకుడు, అధికార భాషా సంఘానికి అధ్యక్షులుగా పనిచేశారు. నవలా రచయిత్రి, స్త్రీవాద రచయిత్రి, సాహిత్యఅకాడమీ పురస్కార గ్రహీత అబ్బూరి ఛాయాదేవి వీరి కోడలు.

అబ్బూరి పాఠశాల విద్య 5వ ఫారం వరకూ తెనాలి లోనే జరిగింది. సికంద్రాబాద్ లో మహబూబ్ కళాశాలలో మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణులై అక్కడే అరబిక్ ను అభ్యసించారు. ఎఫ్.ఎ. (నేటి ఇంటర్మీడియట్) చదవడానికి నోబుల్ కళాశాలలో చేరారు. బలిజేపల్లి లక్ష్మీకాంతం, గోవిందరాజులు సుబ్బారావులు అబ్బూరికి మిత్రులు.

అబ్బూరి మైసూరు లోని సంస్కృత కళాశాలలో చేరినప్పుడు, అప్పటి విద్యాధికారి కట్టమంచి రామలింగారెడ్డి, 1915 లో అచ్చైన అబ్బూరి యొక్క మల్లికాంబను చదివి మెచ్చుకొన్నాడు. అబ్బూరికి అక్కడే ఉన్న రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మతో స్నేహం కుదిరింది. అబ్బూరి 1916లో వీణ శేషన్న వద్ద కొంతకాలం పాటు వీణను కూడా నేర్చుకున్నారు . తరువాత మైసూరులో ఫలప్రదంగా గడిపిన 3 సంవత్సరాలు అబ్బూరిలో సృజనాత్మకత వెల్లివిరియడానికి దోహదం చేసింది. అక్కడే ఊహాగానము, నదీ సుందరి వంటి కావ్యాలు రచించారు. కోడి రామమూర్తిని ప్రశంసిస్తూ, "ఆంధ్ర వీర కంఠీరవ" (ఆంధ్ర వీరులలో మృగరాజు వంటి వాడు) అనే పద్యాన్ని వ్రాయడం జరిగింది.

1918లో కలకత్తా వెళ్ళి సిటీ కళాశాలలో బి.ఏ. కొరకు ప్రవేశం తీసుకున్నారు. అక్కడ పండితులు అక్కిరాజు ఉమాపతి తరువాత బెంగాల్ ఆంధ్ర సంఘం (అసోఏసిఏషన్) కు ఉపాధ్యక్షులు కూడా అయ్యారు. బి.ఏ. పట్టా తీసుకున్న తరువాత కొంతకాలం శాంతి నికేతన్ లో ఉండి తిరిగి ఆంధ్ర రాష్ట్రానికి తిరిగివచ్చారు. అబ్బూరికి కాంగ్రెస్ నాయకులు భోగరాజు పట్టాభి రామయ్య, చెరుకువాడ వెంకట నరసింహం, కవులు చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, త్రిపురనేని రామస్వామి, కృష్ణా పత్రిక సంపాదకులు ముట్నూరి కృష్ణారావు వంటి వారి సాహచర్యం లభించింది.

1919 సంవత్సరంలో ఆంధ్ర దేశంలో స్వరాజ్యోద్యమం మమ్మురంగా సాగుతున్న రోజులలో రామదండును నిర్వహిస్తున్న ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఆధ్వర్యంలో అబ్బూరి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. అకాలంలో "జలియన్ వాలాబాగ్" బుర్రకథ (జంగం కథ) రచించి అనేక చోట్ల ప్రదర్శించారు. ఇది బహుళ ప్రజాదరణ, ప్రచారం పొందింది, కానీ అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం నిషేధించింది. ఈ ప్రచురణ కూడా అందుబాటు లేదు. అబ్బూరికి కార్మిక సంఘాలతోను, కమ్యూనిష్టు పార్టీ నేతలతోనూ అనుబంధం ఉండేది. ఆ సందర్భం లోనే పుచ్చపల్లి సుందరయ్యతో, ఎం.ఎన్.రాయ్ వంటి వారితో సాన్నిహిత్యం ఏర్పడింది.

అబ్బూరి 1909 నాటికే, అయిదో ఫారం చదువుతుండగానే "జలాంజలి" అను పద్యకావ్యం రచించారు. 1917-19 మధ్య కాలం అబ్బూరి గురుదేవులు రవీంద్రనాథ్ ఠాగూర్ సన్నిధిలో శాంతినికేతన్ లో గడిపారు. అప్పుడే వీరు "ఊహాగానం", నిరాడంబరతా భావనాబలాలు" రచించారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీ శ్రీ), భాషావేత్త ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి, బాలాంత్రపు రజనీకాంతరావు మొదలగువారు అబ్బూరిని తమ గురువుగా భావించేవారు, వారిని మాస్టారు అని సంబోధించేవారు. వారితో అనేక సాహిత్య చర్చలు జరిపేవారు. 1917- 18 మధ్య ఆంధ్ర పత్రికలో "సారస్వతానుబంధం" అను శీర్షికను పెట్టవలసిందని నాగేశ్వరరావు పంతులుకు అబ్బూరి సూచించాడు. ఇతని "అభినవకవితాప్రశంస" అను వ్యాసముతో శీర్షిక ఆరంభమైంది. 1923-24 సంవత్సరాల మధ్య "రసమంజరి" అను కొత్త అనుబంధం ప్రవేశపెట్టించారు. పదగుంఫన అబ్బూరి ప్రత్యేక ప్రతిభ. గీతాలలో గొప్ప హుందాతనం గోచరిస్తుంది. ఉత్తమ సంస్కృత కావ్యాలలోని పూర్ణతా, గౌరవమూ, గాంభీర్యమూ ఈయన పద్యాలలో ప్రతిబింబిస్తాయి. నన్నయ నాటి అక్కరలకు మార్పులు తెచ్చి, కొత్త నడకలు నడిపించడమే కాకుండా, స్వకపోలకల్పితాలైన నూతన ఛందస్సులు కూడా కల్పించారు . ఈయన పద్యాలలో ఒక్క పలుకు పట్టి చూచినా ఉత్తమ సంస్కారి అని తెలుస్తుంది. వీరు రాసిన చాటువులు, ఆశువులు చాలా ప్రసిద్ధి పొందాయి. ఇంకా ఆంగ్ల సాహిత్యంలో తరచుగా కనిపించే సానెట్స్ (గీత మాలికలు) రాశారు. 1936లో ప్రేమచంద్, నజ్జాద్ జహీర్, హిరేన్ ముఖర్జీ వంటి వారితో కలసి అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం స్థాపించి, వారి పత్రిక "ఇండియన్ లిటరేచర్" సంపాదకవర్గంలో ఒకరుగా ఉన్నారు. ఈయన 1939 లో ఎం.ఎన్.రాయ్, లక్ష్మణశాస్త్రి, సచ్చిదానంద వత్సాయన్ వంటి వారితో కలసి స్థాపించిన భారతీయ పునరుజ్జీవన సంఘం (ఇండియన్ రినైసెంస్ అసోసియేషన్) సాహిత్య పునర్వికాసంలో ముఖ్యపాత్ర వహించింది.

వీరికి నాటకాలంటే చాలా ఇష్టం ఉండేది. వారు నాటకాలు రచించారు. దర్శకత్వం వహించారు, హైదరాబాదులో, దిల్లీలో కూడా ప్రదర్శించారు. ముఖ్యంగా కన్యాశుల్కం, ప్రతిమాసుందరి వంటి వాటిలో నటించారు. కన్యాశుల్కం లో రామప్పపంతులు వేషం వేసి రక్తి కట్టించారు. నటాలి, నాట్యగోష్ఠి వంటి సంస్థలు అబ్బూరి వారి నాటక రంగ సేవకు నిదర్శనాలు. 1957 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంగీత, నాటక, సాహిత్య, లలిత అకాడమీ స్థాపనలో ముఖ్య సలహాదారుగా కీలకపాత్ర వహించి అకాడమీ స్థాపనకు అంకురార్పణ చేశారు. వీరి సూచన అనుసరించి ఆకాశవాణిలో 1957 లో 90 నిముషాల జాతీయ నాటకాల ప్రసారం మొదలు పెట్టింది. మృచ్ఛకటికం నాటకాన్ని తర్జుమాచేశారు. మృచ్ఛకటికం నాటకాన్ని అప్పుడే దిల్లీలో ప్రారంభమైన దూరదర్శన్ (1965) లో, డా. సర్వేపల్లి రాధాకృష్ణ వద్ద రాష్ట్రపతి భవన్ లో ప్రదర్శించారు. ఆయన పదవీ విరమణ తరువాత హైదరాబాద్ లో ఎ.ఆర్.కృష్ణ, మంత్రి శ్రీనివాసరావు తదితరులతో కలసి "నాట్య విద్యాలయ"ను స్థాపించి నాట కాలకు దర్శకత్వం వహించడమే కాకుం డా ఒక సంవత్సరం థియేటర్ ఆర్ట్స్ లో సర్టిఫికేట్ అధ్యయనాలను ఆరంభిం చారు. జాతీయ నాటక పాఠశాల, దిల్లీ (నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, దిల్లీ) పట్ట ప్రదాన సభ యందు స్నాతకోపన్యాసం ఇచ్చారు.

అబ్బురి వారి రచనలను సేకరించి ఊహాగానము, ఇతర కృతులు పేరుతో కవితాసంస్థ ప్రచురించింది.

ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1926 లో స్థాపించిన తరువాత కట్టమంచి రామలింగారెడ్డి విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు అయ్యాక అబ్బూరిని గ్రంథాలయంలో నియమించారు. సర్వేపల్లి రాధాకృష్ణ ఉపాధ్యక్ష్యులుగా ఉన్నప్పుడు డా.ఎం.ఓ. థామస్ ను గ్రంథాలయాధికారిగా నియమించి, అబ్బురిని తెలుగు విభాగములో ప్రప్రథమ ఆంధ్రోపన్యాసకుడుగా పంపారు. అక్కడ తెలుగు భాషతో బాటు గీర్వాణము కూడా బోధించారు. థామస్ తరువాత విశ్వవిద్యాలయ గ్రంథాలయానికి గ్రంథాలయాధికారిగా నియమింపబడి అబ్బూరి అక్కడే సుమారు 30 సంవత్సరాలు పనిచేశారు. గ్రంథాలయాధికారిగా నియంపబడినప్పుడు గ్రంథాలయ సంబంధిత ఉద్యోగార్హతలు లేవు. 1932-33 మధ్య బ్రిటీష్ గ్రంథాలయ సంఘం, లండన్ వారి నుంచి (ఎఫ్.ఎల్.ఎ) "ఫెలో ఆఫ్ లైబ్రరీ అసోసియేషన్, లండన్" అనే గౌరవ పట్టా పొందారు. సాహిత్య, సాంస్కృతిక రంగాలలో విద్వత్తు కలిగిన అబ్బురి గ్రంథాలయాధికారిగా ఉన్నందున అనేక మంది కవులు, పరిశోధకులు కూడా ఆయన సలహాలను పొందుతూండేవారు. విశాఖపట్నంలో సాహిత్య వాతావరణం పెరగడానికి అది దోహదం చేసింది. గ్రంథాలయాలు వాటి విద్యుక్త ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించడానికి వివిధ స్థాయిలలో శిక్షణ పొందిన సిబ్బంది అవసరాన్ని గుర్తించిన అబ్బూరి వారు ఆంధ్ర విశ్వకళా పరిషత్ గ్రంథాలయ శాస్త్రంలో సర్టిఫికేట్, డిప్లొమాలలో అధ్యయనాలు ప్రవేశ పెట్టారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు డా. వి. ఎస్.కృష్ణతో వారి సాన్నిహిత్యం, ఆత్మీయత విశ్వవిద్యాలయ గ్రంథాలయం ఇంకా గ్రంథాలయశాస్త్ర అధ్యయనాలను అభివృద్ధి చేయడానికి తోడ్పడ్డాయి. అబ్బూరి రామకృష్ణారావు తమ పదవీ కాలం పూర్తయిన 2/3 సంవత్సరాల తరువాత 1960లో పదవీ విరమణ చేశారు. గ్రంథాలయాలకు సంబంధించి వారు "గ్రంథాలయాలు అనాథ శరణాలయాలు కాదు ... అనాథ శరణాలయాలు మాదిరి అభివృద్ధి చెందకూడదు." అని సందేశాన్ని ఇచ్చారు.. ఇంకా ఆంధ్ర రాష్ట్రానికి కర్నూలు రాజధానిగా ఉన్నప్పుడు అబ్బురి రాష్ట్ర గ్రంథాలయ కమిటీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని, పౌర గ్రంథాలయోద్యమ సమస్యలను చర్చించి అక్కడి జిల్లా గ్రంథపాలకులకు తమ సహకారాన్ని అందించారు. వారిలో చాలావరకు అతని విద్యార్థులే. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కొత్తగా ఏర్పడుతున్నప్పుడు ఆంధ్ర గ్రంథాలయ చట్టం ఏర్పడటములో కీలక పాత్ర వహించారు.

వీరు ఎన్నో బిరుదులు, సన్మానాలు నిరాకరించారు. తెలుగు సాహిత్య సేవకి, ఆంధ్రవిశ్వవిద్యాలయ గ్రంథాలయాభివృద్ధికి, పౌర గ్రంథాలయోద్యమంలో అబ్బూరి కీలకపాత్రను గుర్తించి ఆంధ్ర విశ్వకళా పరిషత్ తమ 47వ పట్ట ప్రదాన సభ యందు 1974 ఆగస్టు 3న అబ్బూరికి కళాప్రపూర్ణ బిరుదు ప్రదానం చేశారు. దీనిని మాత్రమే స్వీకరించారు. 1953 సంవత్సరంలో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడి తరువాత రాష్ట్ర ప్రభుత్వం 1956 లో కొత్తగా ఏర్పడ్డ విశాలాంధ్ర రాష్ట్రంలో గ్రంథాలయాల అనుసంధానాన్ని విస్తృతం చేయడానికి, రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం ఏర్పాటులో అబ్బూరి వారి సలహా, సహకారం కోరింది. విశాఖ రచయితల సంఘం అధ్యక్ష్యులుగా నన్నయ్య పదసూచి సంకలనానికి ఆరంభించారు. సాహిత్య అకాడమీ ఏర్పడ్డ తరువాత తిక్కన్న మొదలగు ఆ చూకీ గ్రంథాలు, 20వ శతాబ్దపు తెలుగు సాహిత్య ప్రచురణల సూచిని తయారు చేయుటకు ప్రణాళికలు తయారు చేశారు. వీరికి కేంద్ర సాహిత్య అకాడమీ, కేంద్ర సంగీత నాటక అకాడమీతో అనుబంధం ఉంది. 1957-58 మధ్యలో సాహిత్య అకాడమీ వారి అభ్యర్థన మేరకు రబీంద్రనాథ్ టాగోర్ వారి చాలా నాటకాలు తెలుగులోకి తర్జుమా చేశారు.

అబ్బూరి 30 ఏప్రిల్, 1979 రోజు మరణించారు.

**డా. జొన్నకూటి ప్రమోద్ కుమార్**
**9490833108.**

# ప్రజా సేవలో జమ్మలమడక నాగమణి



కాకినాడ, (విశాఖ సమాచారమ్): జనం కోసం ఆలోచించే వారు.. జనంకు ఏ అవసరం వచ్చినా అక్కడ తాను ఉన్నానంటూ ప్రత్యక్షమయ్యి ఆ అవసరాన్ని తీర్చేస్తుంటారు. ఈ ఆలోచన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డికి తన రక్తంలోనే ఉంది కాబట్టే వారి పాలనలో స్పష్టంగా కనబడుతోంది. అలాంటి క్రమశిక్షణే తమ వారసులగా ఉన్న పార్టీ నాయకులకు వారసత్వ సంపదగా అందిస్తున్నారు అనడానికి కాకికాడలో ప్రకృతి విలయతాండవానికి చెట్లు, కరంట్ స్థంబాలు పలు చోట్ల విరిగిపోయాయి. ఈ క్రమంలోనే కార్పొరేషన్ పరిధిలో 49వార్డు రామ్‌నగర్‌లో చెట్లు, కరంట్ స్థంబాలు ఒరిగిపోవడం, విరిగిపోవడంతో రాకపోకలకు సుమారు రెండు గంటలకు పైగా అంతరాయం కలిగింది. ఆ ఏరియాలోనే నివాసం ఉంటున్న వైఎస్సార్ పార్టీ ఉభయగోదావరి జిల్లాల జోనల్ కన్వీనర్ జమ్మలమడక నాగమణి వెంటనే స్పందించి కూలీలను వెంటనే రప్పించి రెండుగంటలకు పైగా సమయం వెచ్చించి ఆగమేఘాల మీద రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న చెట్లను, కరెంట్ స్థంబాలను తొలగింప చేసి స్థానికుల రాకపోకలకు సుగమం చేసారు. నాయకుడును బట్టే క్రింద స్థాయి నాయకులు ఉంటారనడానికి జమ్మలమడకే నిదర్శనం. సమస్యను గుర్తించి వెంటనే పరిష్కార మార్గం చూసి ప్రజలకు చేదోడు వాదోడుగా నేనున్నానంటూ నమ్మకాన్ని కల్పించిన శ్రీమతి నాగమణిని స్థానికులు హర్షం వ్యక్తం చేసారు.

# కేరళలో ఘోరం.. రైల్లో ప్రయాణికుడికి నిప్పు

## పట్టాలపై ముగ్గురి మరణం



ప్రశాంతతకు మారుపేరైన కేరళలో ఘోరం చోటుచేసుకుంది. గతంలో ఎక్కడో జరిగిన సంఘటనను గుర్తుచేస్తూ అలాంటి ఘటనే జరిగింది. కదులుతున్న రైల్లోని ప్రయాణికుడికి నిప్పంటించడం.. ఆ తర్వాత పట్టాలపై ముగ్గురు చనిపోవడం దీనినే చాటుతోంది. మొత్తానికి ఈ ఘటన వెనుక ఉగ్ర వాద కోణం ఉందన్న వాదన వినిపిస్తోంది.

**పెట్రోల్ పోసి నిప్పు..** కదులుతున్న రైల్లోని ప్రయాణికుడి పై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన కేరళలో జరిగింది. తోటి ప్రయాణికుడితో వాగ్వాదానికి దిగిన వ్యక్తి ఈ ఘటనకు పాల్పడ్డాడు. కోపంతో ఊగిపోతూ సజీవ దహనానికి ప్రయత్నించాడు. ఒంటి పై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. అవే మంటలు మిగతా ప్రయాణికులకు అంటుకున్నాయి. ఈ ఘటనలో ఏడాది చిన్నారి సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. మొత్తం ఎనిమిది మంది గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో అలప్పుజ-కన్నూర్ ఎగ్జిక్యూటివ్ ఎక్స్ ప్రెస్ రైలు కోజికోడ్ దాటింది. ఓ వంతెన మీదుగా వెళ్తున్న క్రమంలో ఓ ప్రయాణికుడు తోటి ప్రయాణికుడి పై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ పరిణామంతో మిగతావారు తీవ్ర ఆందోళన చెందారు. మంటలు కొందరిని అంటుకున్నాయి.

**చైన్ లాగి..** ఈ ఘటన నేపథ్యంలో ప్రయాణికులు చైన్ లాగి రైలు ఆపేశారు. కొందరు ముందుకొచ్చి మంటల అంటుకున్నవారిని కాపాడారు. రైల్వే పోలీసులు వచ్చి గాయపడిన 8 మందిని ఆస్పత్రికి తరలించారు. ఇదంతా అయిపోయిన తర్వాత చూస్తే ముగ్గురు ప్రయాణికుల అచూకీ మిస్సయింది. గాలింపు నేపథ్యలో.. వంద మీటర్ల ఆవల వారి డెడ్ బాడీలు కనిపించాయి. వీరు ఏడాది పాప ఓ పురుషుడు ఓ మహిళగా గుర్తించారు.

**అసలేం జరిగిందో?** ఇద్దరు ప్రయాణికుల మధ్య గొడవతో వీరు రైలు నుంచి దూకారా? లేదా జారిపడ్డారా? కిందకు దిగబోయి ప్రాణాలు కోల్పోయారా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. పైగా వీరంతా ఒకే కుటుంబం వారని స్పష్టమవుతోంది. ప్రమాద ఘటనలో వీరికి ఏదైనా సంబంధం ఉందా? అని ఆరా తీస్తున్నారు.

**నిందితుడు ఎక్కడ?** పెట్రోల్ పోసి నిప్పంటించిన నిందితుడు ప్రమాదం తర్వాత పారిపోయాడు. ఇక ఎమర్జెన్సీ చైన్ లాగినందున రైలు ఏకంగా వంతెనపైనే ఆగిపోయింది. అప్పుడే అతడు రైలు దూకినట్లుగా అక్కడ చూసినవారు అనుమానిస్తున్నారు. ఇక ఆ నిందితుడి కోసం ఒకరు బైక్ పై వేచి చూస్తున్నాడని.. అతడి ద్వారానే నిందితుడు పారిపోయాడని చెబుతున్నారు. దీనికితోడు ఘటనా స్థలంలో ఓ బ్యాగు అనుమానస్పదంగా ఉండడంతో ఉగ్రవాద కోణంలోనూ విచారణ చేస్తున్నారు. అందులోనూ ఓ పెట్రోల్ సీసా రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అన్నిటికి మించి సహ ప్రయాణికుడితో నిందితుడు ఉద్దేశపూర్వకంగానే వాదనకు దిగినట్లుగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# క్షత్రియ పరిషత్‌కి నిస్వార్థంగా సేవ చేస్తా



కాకినాడ, (విశాఖ సమాచారమ్): క్షత్రియ పరిషత్ కి క్షత్రియ సామాజిక వర్గానికి నిస్వార్ధంగా సేవ చేస్తానని అడ్డూరి భాస్కర రామకృష్ణ రాజు అన్నారు. స్థానిక కాకినాడ గాంధీనగర్ క్షత్రియ భవన్ లో నూతనంగా క్షత్రియ పరిషత్ అధ్యక్షులుగా తూరంగి గ్రామానికి చెందిన అడ్డూరి భాస్కర రామకృష్ణ ( తూరంగి బుజ్జి) ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర చీఫ్ విప్ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాద్ రాజు విచ్చేసి, ఆయన చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం చేయించి దుస్సాలువతో గజమాలతో పలువురు ఘనంగా సత్కరించారు. అనంతరం ఈ కార్యక్రమానికి మరొక విశిష్టగా అతిథిగా విచ్చేసిన పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతలపాటి వెంకట పతిరాజు ను క్షత్రియ పరిషత్ చైతన్య రాజు మర్యాదపూర్వకంగా గజమాలతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో క్షత్రియ అధ్యక్షుడుగా ఎన్నుకున్నారని తప్పకుండా పరిషత్ అభివృద్ధికి కృషి చేయడం జరుగు తుందన్నారు అదేవిధంగా మన పెద్దలు ప్రజాప్రతినిధులు సహకారంతో మనం మరో నూతనంగా నిర్మించుకోవలసిన కిడ్నీ పరిషత్ నిర్మాణానికి కూడా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి క్షత్రియ పరిషత్ కార్యవర్గం సభ్యులు అడ్డూరి పనిష్, దాట్ల సుబ్బరాజు, దాట్ల సరబాబు, యువరాజు, కటారి కిరణ్ కుమార్ రాజు జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున క్షత్రియ సామాజిక వర్గం పాల్గొన్నారు. దాట్ల వాసు రాజు కృష్ణంరాజు వత్సవాయి రామకృష్ణంరాజు మాజీ సర్పంచ్ బలగం ప్రసన్న కుమార్ కుమార్ ఆలయ కమిటీ చైర్మన్ బాబులు ప్రసాద్ పంతులు జిల్లా బ్రాహ్మణ సంఘ నాయకులు సూర్య ప్రకాష్ రూరల్ ప్రెస్ క్లబ్ సభ్యులు సురేష్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు సభ్యులు జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున క్షత్రియ సామాజిక వర్గం పాల్గొన్నారు.

# నేడు శ్రమదానం



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): జిల్లా అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళ వారం పెద్ద ఎత్తున "శ్రమదానం" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. సోమ వారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పార్వతీపురం పట్టణానికి జిల్లా కేంద్రంకు ఉండాల్సిన హంగులు ఉండాలన్నారు. మంగళ వారం ఉదయం 6 గంటలకు "శ్రమదానం" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణ, చుట్టు ప్రక్కల, ఇతర ప్రాంతాల్లో శ్రమదానం జరుగుతుందని ఆయన అన్నారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ఉద్యోగులను బృందాలుగా విభజించి ఒక్కో బృందానికి ఒక్కో ప్రాంతాన్ని ఇవ్వడం జరుగుతుందని ఆయన వివరించారు. బాగా చేసిన బృందానికి బహుమతులు అందించేందుకు యోచిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి వారం శ్రమదానం చేసి కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు.

ప్రజలు భాగస్వామ్యం కావాలి.

పట్టణ పారిశుధ్యం, సుందరీకరణలో భాగంగా శ్రమదానం కార్యక్రమంలో పట్టణ ప్రజలు భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పిలుపునిచ్చారు. పట్టణం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుటకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**5న ప్రహరీ ప్రారంభం**

జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రహరీ, గేట్ లను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఈ నెల 5వ తేదీన ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# పౌష్టికాహారాన్ని తినండి ఆరోగ్యంగా ఉండండి బాల్యవివాహాలు చేసుకోవడం వలన ఆరోగ్య సమస్యలు వస్తాయి



విజయనగరం: గర్భిణీలు బాలింతలు పిల్లలను అంగన్వాడి కేంద్రాల సిబ్బంది చక్కగా చూసుకోవాలన్నారు సోమవారం విజయనగరం స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో స్థానిక వీటి అగ్రహారం కళ్యాణమండపంలో పోషన్ పక్వడా లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ముందుగా అతిథులను అర్బన్ ఐసిడి ఎస్ సిడిపిఓ ప్రసన్న ఆహ్వానించారు ఈ సందర్భంగా ఎస్ సి పి సి ఆర్ చైర్పర్సన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెడుతుందని అందులో భాగంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా బాలింతలు గర్భిణీలు, పిల్లలు కోసం ఎంతో ఖర్చు పెట్టి పౌష్టికాహారాన్ని సరఫరా చేస్తుందని అందువలన ప్రతి ఒక్క లబ్ధిదారులు పౌష్టికాహారాన్ని సక్ర మంగా వినియోగించుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు బాల్య వివాహాలు జరగకుండా తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు బాల్య వివాహాలు ఎక్కడైనా జరిగినట్లు తెలిస్తే అందుకు దగ్గర ఎవరైతే ఉంటారో వాళ్ళ పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శాంత కుమారి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రం ద్వారా సరఫరా చేస్తున్న పోర్ట్ ఫైడ్ రైస్ ను లబ్ధిదారులందరూ వినియోగించుకోవాలన్నారు రక్తహీనత లేకుండా చూసుకోవాలని అన్నారు కార్పొరేటర్ చంద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లలు సెల్ ఫోన్ కి దూరంగా ఉండాలని పాఠశాలలో చెప్పిన పాఠాలు శ్రద్ధగా విని ఇంటికి వచ్చిన తర్వాత వాటిని అవగాహన చేసుకుని చక్కగా చదువుకోవాలి అన్నారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను సందర్శించి రాగులు, జొన్నలు తదితర చిరు ధాన్యాలతో తయారు చేసిన వంటకాలను ఆసక్తి గా తిలకించారు గర్భిణీలకు సామూహిక సీమంతాలు చేశారు ఆరోగ్యవంతమైన పిల్లలకు వెల్ బేబీ షో నిర్వహించి బహుమతుల ప్రదానం చేశారు . పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డిబేటు ఎస్సే రైటింగ్ ఏర్పాటు చేసి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారుఈ కార్యక్రమంలో సి డబ్ల్యు సి చైర్పర్సన్ జి హిమబిందు సిడిపిఓలు సూపర్వైజర్లు సచివాలయ సిబ్బంది అంగన్వాడి కార్యకర్తలు తల్లులు సఖి గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

# నాలుగేళ్లలో యూపీలో ట్రిలియన్ ఎకానమీ-యోగీ ఆదిత్యనాథ్

ఉత్తర్ ప్రదేశ్ లో తాజాగా ఆరేళ్ల పాలన పూర్తి చేసుకున్న యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం.. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకునే దిశగా వ్యూహాత్మక అడుగులేస్తోంది. యూపీలో రెండోసారి అధికారం చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్నసందర్భంగా భారీ ఎత్తున పెట్టుబడుల్ని ఆకర్షించిన యోగీ సర్కార్.. ఇప్పుడు వాటిని అందిపుచ్చు కుని ఆర్థిక వ్యవస్థను పరుగులు తీయించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం వచ్చే నాలుగేళ్లలో ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ స్థాయికి (రూ.82 లక్షల కోట్లు)కు తీసుకెళ్లేందుకు సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్లాన్ సిద్ధం చేశారు.



వచ్చే నాలుగేళ్లలో ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థను సాధించే లక్ష్యంతో 10 కీలక రంగాలపై ఫోకస్ పెట్టాలని సీఎం యోగి నిర్ణయించారు. ఆర్థిక వ్యవస్థ వృద్ధికి కీలకమైన ఈ పది రంగాల్లో శాంతిభద్రతలు, వ్యవసాయాభివృద్ధి, సామాజిక భద్రత, మౌలిక సదుపాయాలు, పారిశ్రామికాభివృద్ధి, గ్రామీణ, పట్టణాభివృద్ధి, విద్య, వైద్యం, పర్యాటకం, రెవెన్యూ ఉన్నాయి. తాజాగా పెట్టుబడుల సదస్సులో రూ.35 లక్షల కోట్ల మేర ప్రతిపాదనలు వచ్చాయి. వీటిలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.6.9 లక్షల కోట్ల పెట్టుబడులు ఉన్నాయి.

వచ్చే నాలుగేళ్లలో ఈ పెట్టుబడులన్నీ కార్యరూపం దాల్చేలా పది రంగాలు పుంజుకునేలా ప్రతీ రంగానికీ ఓ అదనపు కార్యదర్శి స్థాయి అధికారుల్ని యోగీ నియమించారు. ఈ పది రంగాల అభివృద్ధి కోసం స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలు తయారు చేయాలని యోగీ ఆదేశాలు ఇచ్చారు. కోవిడ్ కారణంగా గత మూడేళ్లు ప్రపంచవ్యాప్తంగా, అలాగే దేశంలోనూ ఆర్థిక వ్యవస్థలన్ని కుదేలయ్యాయని, కానీ యూపీ మాత్రం 16.8 శాతం వృద్ధి రేటు నమోదు చేసుకుందని యోగి సర్కార్ చెబుతోంది. అలాగే జాతీయోత్పత్తిలో 8 శాతం యూపీ నుంచే ఇస్తున్నట్లు కూడా చెబుతోంది.

# గురువింద గింజ చందాన తెలుగుదేశం నాయకులు విమర్శలు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): తెలుగుదేశం పార్టీ నాయకులు స్థానిక శాసనసభ్యులు రాష్ట్రమంత్రి గుడివాడ అమర్నాథ్ పై లేనిపోని విమర్శలు చేస్తే సహించేది లేదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పట్టణ శాఖ అధ్యక్షుడు మందపాటి జానకి రామరాజు అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, సచివాలయ కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, 83వ వార్డు ఇంచార్జ్ జాజుల రమేష్ హెచ్చరించారు. విద్యావంతుడేనా అమర్నాథ్ నియోజకవర్గం అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నారని ప్రజల్లో అమర్నాథకు పెరుగుతున్న ప్రజాభిమానాన్ని చూసి ఓర్వలేక మాజీ శాసనసభ్యుడు పీలా గోవిందా సత్యనారాయణ తప్పుడు విమర్శలు చేస్తున్నారని అన్నారు. గురువింద గంజా సామెత చందన గోవింద సత్యనారాయణ ఎమ్మెల్యే అమర్నాథ్ పై అవినీతి ఆరోపణలు చేయడం ఉందన్నారు. భూ కుంభకోణాల్లో సీట్ దర్యాప్తులు ఎవరిపై జరిగాయో అనకాపల్లి ప్రజానీకానికి పూర్తిగా తెలుసు అన్నారు. పదేపదే సుగర్ ఫ్యాక్టరీ విషయమై అమర్నాథ్ పై విమర్శలు చేస్తున్న తెలుగుదేశం నాయకులు తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో షుగర్ ఫ్యాక్టరీని మాజీ ఎంపీ ఎంవివి ఎస్ మూర్తికి అమ్మాలని చూడడం నిజం కాదా అని నిలదీశారు. మంత్రి అమర్నాథ్ ప్రస్తుత షుగర్ ఫ్యాక్టరీలో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ లు ఏర్పాటుచేసి ఈ ప్రాంత రైతాంగానికి యువతకు మేలు చేయాలని సంకల్పించారన్నారు. మంత్రి అమర్నాథ్ జి20 సదస్సును, విశాఖలో పరిశ్రమలలో తెచ్చేందుకు చేస్తున్న కృషిని చూసి ఓర్వలేక చేస్తున్నారన్నారు. మండలంలోని కోడూరులో 120 ఎకరాల్లో పరిశ్రమ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని చూస్తున్న అమర్ పై విమర్శలు చేయడం తగదన్నారు. ప్రతి గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రాలు సచివాలయ కార్యాలయాలు సిమెంట్ రోడ్లు వేసిన ఘనత అమర్నాథ్ అన్నారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ వచ్చే ఎన్నికల్లో సీటు కోసం అధినాయకత్వం దగ్గర మెప్పు పొందేందుకు అమర్నాథ్ పై విమర్శలు చేయడం తగదని అనకాపల్లి అభివృద్ధి కాంచించే వారైతే సూచనలు సలహాలు ఇచ్చి అభివృద్ధికి సహకరించాలని అన్నారు.

# నవజాత శిశువులపై జాలి చూపండి



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రిలోని నవజాత శిశువులపై జాలి చూపించాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. సోమవారం జనసేన పార్టీ నాయకులు వంగల దాలి నాయుడు, మహేశ్వర అజయ్ కుమార్ తదితరులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ని జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ ను కలిసి జిల్లా ఆసుపత్రిలో స్పెషల్ న్యూ బార్న్ కేర్ యూనిట్ ఎస్ ఎన్ సి యు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన నవజాత శిశువుల సంరక్షణకై జిల్లా ఆసుపత్రిలో ఎస్ఎన్.సియు ఏర్పాటు చేశారన్నారు. దీనిలో గత కొంతకాలంగా ఏసీలు పనిచేయకపోగా, ఫ్యాన్లు కూడా లేవన్నారు. దీంతో అప్పుడే పుట్టిన పిల్లలు ఓవైపు రోగంతో పోరాడుతూ మరోవైపు ఉక్కబోతకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారన్నారు. వేసవి వేడిమి ఒకపక్క, రోగం మరో పక్క వేధిస్తుండడం తో విలవిలలాడుతున్నారన్నారు. తక్షణమే ఏసీలు మరమ్మత్తులు చేయించడం లేదా ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని కోరారు. గత కొంతకాలంగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుపోవడం శోచనీయమన్నారు. తక్షణమే నవజాతి శిశువులపై జాలి చూపించి చూపించాలన్నారు. ఎస్ఎన్.సీలో ఏసీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేసి పిల్లల ప్రాణాలకు హాయి కల్పించాలన్నారు. ఎస్ ఎన్ సి యు లో అధికంగా గిరిజన ప్రాంతాలకు చెందిన పిల్లలే ఎక్కువగా ఉంటున్నారన్నారు. ఎవరికి చెప్పాలో తెలియక తల్లిదండ్రులు ఆవేదం చెందుతున్నారన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# మెనోపాజ్‌లో ఈ ఆహారం కచ్చితంగా తీసుకోవాలి..!



మెనోపాజ్.. స్త్రీ పునరుత్పత్తి వయసు అయిపోయిందనడానికి ఇది సూచన. పన్నెండు నెలల పాటు పూర్తిగా పీరియడ్స్ రాకుండా ఉండడాన్నే మెనోపాజ్ అంటారు. మన దేశంలో 46 ఏళ్ల నుంచి 52 ఏళ్ల వరకు ఈ దశ ఉంటుంది. పుట్టుకతోనే మహిళలకు కొన్ని లక్షల అండాలు అండాశయాల్లో ఉంటాయి. వయసుతో పాటు అవన్నీ తరిగిపోతూ ఉంటాయి. చివరిగా అడుగంటిపోతాయి. అప్పటి నుంచి మెనోపాజ్ లక్షణాలు బయటపడటం మొదలవుతాయ్. ఈ సమయంలో హార్మోన్లలో వచ్చే తేడాల కారణంగా భావోద్వేగాల్లో మార్పులు, శారీరక ఇబ్బందులూ వస్తాయి. అండాశయాల నుంచి హార్మోన్ల విడుదల ఆగిపోవడం, ముఖ్యంగా ఈస్ట్రోజెన్ స్థాయి తగ్గడం వల్ల కొన్ని సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. గుండె దడగా అనిపించడం, రాత్రి పూట చమటలు పట్టడం, ఎక్కువసార్లు యూరిన్కెళ్లడం, మూత్రనాళం ఇన్ఫెక్షన్, ఎముకలు బలహీన పడటం, బరువు పెరగడం లేదా తగ్గిపోవడం వంటి సమస్యలు ఇబ్బంది పడుతూ ఉంటాయి. మెనోపాజ్ లక్షణాలు నుంచి ఉపశమనం పొందడానికి మన లైఫ్స్టైల్లో మార్పులు చేసుకోవాలని, ముఖ్యంగా మంచి ఆహారపు అలవాట్లు చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. మెనోపాజ్ సమయంలో మహిళలు తీసుకోవలసిన డైట్ గురించి డైటీషియన్, న్యూట్రిషనిస్ట్ డాక్టర్ శ్రీలత మనకు వివరించారు.

**డైరీ ఉత్పత్తులు తీసుకోండి..** మెనోపాజ్ సమయంలో.. ఈస్ట్రోజెన్ స్థాయిలలో క్షీణత కారణంగా బోన్ ఫ్రాక్చర్ ఎక్కువగా అవుతాయి. పాలు, పెరుగు, చీజ్ వంటి పాల ఉత్పత్తులలో కాల్షియం, భాస్వరం, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్లు D, k పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతాయి. డైరీ ఉత్పత్తులలో అమైనో యాసిడ్స్ ఎక్కువగా ఉంటాయి.. ఇవి నిద్రలేమి సమస్యను దూరం చేస్తాయి. ఒక అధ్యయనంలో, విటమిన్ డి, కాల్షియం ఎక్కువగా తీసుకునే స్త్రీలలో చిన్న వయసులోనే మెనోపాజ్ బారిన పడే ముప్పును తక్కువగా ఉంది.

**ఆరోగ్యకరమైన కొవ్వులు..** ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ వంటి ఆరోగ్యకరమైన కొవ్వులు మెనోపాజ్ దశలో ఉన్న మహిళలకు ఎంతో సహాయపడతాయి. ఒమేగా-3 సప్లిమెంట్స్ హాట్ ఫ్లాషెస్, రాత్రి చెమటలు పట్టడాన్ని నివారిస్తాయని ఓ అధ్యయనం స్పష్టం చేశాయి. మీ ఆహారంలో మాకేరెల్, సాల్మన్ , ఆంకోవీస్ వంటి ఫ్యాటీ ఫిషెస్ చేర్చుకోండి. అవిసె గింజలు, చియా సీడ్స్లోనూ ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్లలంగా ఉంటాయి.

**తృణధాన్యాలు..** తృణధాన్యాలలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటిలో ఫైబర్, విటమిన్ బి, థయామిన్, నియాసిన్, రిబోఫ్లావిన్, పాంతోతేనిక్ యాసిడ్ వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. తృణధాన్యాలు ఎక్కువగా తీసుకుంటే.. గుండె జబ్బులు, క్యాన్సర్, అకాల మరణాలు ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

రుతుక్రమం ఆగిపోయిన 11,000 మంది స్త్రీలపై జరిపిన ఒక అధ్యయనం ప్రకారం, రోజుకు.. 2,000 కేలరీలకు 1.3 గ్రాముల ఫైబర్ తీసుకునే వారితో పోలిస్తే.. 2,000 కేలరీలకు 4.7 గ్రాముల హోల్గ్రైన్ ఫైబర్ను తినేవారికి 17% అకాల మరణం ప్రమాదం తగ్గుతుంది.

మీ డైట్లో బ్రౌన్ రైస్, హోల్-వీట్ బ్రెడ్, బార్లీ, క్వినోవా, ఖొరాసన్ గోధుమలు (కాముట్), రై వంటి ఆహార పదార్థాలు చేర్చుకోండి.

**తాజా కూరగాయలు, పండ్లు..** యలు, పండ్లలో విటమిన్లు, మినరల్స్, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు నిండి ఉంటాయి. మన ప్లేట్లో సగం.. పండ్లు, కూరగాయలు చేర్చుకోవాలని అమెరికన్ ఫుడ్ గైడెన్స్ సిఫార్సు చేసింది. మెనోపాజ్ సమయంలో ఎక్కువ కూరగాయలు, పండ్లు తినే మహిళలకు వేడి ఆవిర్లు 19 శాతం తగ్గినట్లు పేర్కొంది.

బరువు తగ్గడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడమే దీనికి కారణం అని గుర్తించింది.

మెనోపాజ్ సమయంలో.. స్త్రీలు ముఖ్యంగా.. క్రీసిఫెరస్ కుటుంబానికి చెందిన కూరగాయలు తీసుకోవాలని డాక్టర్ సూచించారు. బ్రోకలీ తినడం వల్ల రొమ్ము క్యాన్సర్కు కారణం అయ్యే ఒక రకమైన ఈస్ట్రోజెన్ స్థాయిలు తగ్గాయని, బ్రెస్ట్ క్యాన్సర్ నుంచి రక్షించే ఈస్ట్రోజెన్ రకం స్థాయిలు పెరిగాయని స్పష్టం చేసింది.

**ఫైటోఈస్ట్రోజెన్ ఫుడ్స్..** ఫైటోఈస్ట్రోజెన్ ఫుడ్స్ మన శరీరంలో బలహీనమైన ఈస్ట్రోజెన్లుగా పనిచేస్తాయి. ఫైటోఈస్ట్రోజెన్ ఫుడ్స్ మెనోపాజ్ దశలో ఉన్న మహిళలకు మేలు చేస్తాయని ఓ అధ్యయనం స్పష్టం చేసింది. సోయాబీన్స్, శనగలు, వేరుశెనగ, అవిసె గింజలు, బార్లీ, ద్రాక్ష, బెర్రీలు, రేగు పండ్లు, గ్రీన్, బ్లాక్ టీలో ఫైటోఈస్ట్రోజెన్లు ఉంటాయి. ఈ ఆహార పదార్థాలు.. వేడి ఆవిర్లను తగ్గించడానికి సహాయపడతాయని అన్నారు.

క్వాలిటీ ప్రొటీన్..

మెనోపాజ్ తర్వాత ఈస్ట్రోజెన్ ఉత్పత్తి తగ్గుతుంది, దీని కారణంగా ఎముకలు బలహీన పడతాయి. మోనోపాజ్ దశలో ఆస్టియోపెనియా(%హ్‌వశీజూవఅఱు%), బోలు ఎముకల వ్యాధి వచ్చే ముప్పు పెరుగుతుంది. ఈ దశలలో 20 శాతం వరకు ఎముకల నష్టం జరుగుతుందని, ప్రపంచవ్యాప్తంగా 60 ఏళ్లు పైబడిన మహిళల్లో 10 మందిలో ఒకరు బోలు ఆస్టియోపోరసిస్ బారిన పడుతున్నారని పరిశోధనలు పేర్కొన్నాయి.

దీనిని దృష్టిలో ఉంచుకని మెనోపాజ్ దశలో ఉన్న మహిళలు.. ఎక్కువ ప్రోటీన్ తీసుకోవాలని డాక్టర్ సూచించారు. ప్రొటీన్లు ఎక్కువగా ఉండే మాంసాహారం, చేప, గుడ్లు, పాల ఉత్పత్తులు, ఆకుకూరలు, నట్స్, చిక్కుడు, విత్తనాలు తీసుకోండి. ఇవి మీ డైట్లో చేర్చుకుంటే జీవక్రియలు వేగంగా జరుగుతాయి. కెలోరీలు కరుగుతాయి. ఐరన్, సెలీనియం వంటి ఖనిజలవణాలు శరీరాన్ని సమన్వయం చేస్తాయి. ఎముకలు బలంగా ఉండటానికి ప్రొటీన్ అవసరం.

# చియా విత్తనాలు డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తాయా?



మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఒకటి కంటే ఎక్కువ సమస్యలు ఉంటాయి. ఆరోగ్యం పట్ల శ్రద్ధతో పాటు ఆహారం విషయంలోనూ కొంచెం జాగ్రత్తగా ఉండాలి. అన్నీ హాయిగా తినే స్థోమత వారికి లేదు. చియా విత్తనాలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి దాదాపు అందరికీ తెలుసు. అయితే చియా విత్తనాలు మధుమేహానికి మంచిదా?

మధుమేహం అనేది ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలను ప్రభావితం చేసే ఆరోగ్య సమస్య. మధుమేహం ఉన్న వ్యక్తి శరీరంలో ఇన్సులిన్ లేకపోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉండవచ్చు. శరీరం ఇన్సులిన్‌ను అవసరమైన విధంగా ఉపయోగించలేనప్పుడు డయాబెటిస్ వస్తుంది. ఇది జీవనశైలి వ్యాధి, అంటే మీరు ప్రతిరోజూ చేసేది మరియు మీరు తినేది మీ రక్తంలోని చక్కెర స్థాయిలను నేరుగా ప్రభావితం చేస్తుంది. కాబట్టి, మీ మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవడానికి మీరు ఏమి తినాలి.

మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి. మీరు మీ ఆహారాన్ని మార్చుకోవాలి. ఎలాంటి ఆహారం తింటే మంచిదో, ఎలాంటి ఆహారం ఆరోగ్యానికి మంచిది కాదో తెలుసుకోవాలి. ఉదాహరణకు, మధుమేహం ఉన్నవారికి చియా విత్తనాలు మంచి పోషకాల మూలంగా సూచించబడ్డాయి. ఇది శరీరానికి అవసరమైన పోషకాల యొక్క మంచి మూలం. ఇది అనేక వ్యాధుల నుండి దూరంగా ఉండటానికి సహాయపడుతుంది. అయితే షుగర్ వ్యాధికి చియా సీడ్స్ మంచిదో కాదో తెలుసుకోవాలి.

మధుమేహ వ్యాధిగ్రస్తులు తినే ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వారు తినే ఆహారాన్ని ట్రాక్ చేయకపోతే, వారి ఆరోగ్యం క్షీణిస్తుంది. మీ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో మరియు మీ బరువును నియంత్రణలో ఉంచడంలో సహాయపడే ఆహారాలను తినడం చాలా ముఖ్యం.

చియా విత్తనాలు మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంచిదా? డాక్టర్ గుప్తా ప్రకారం, చియా విత్తనాలు ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, ఫైబర్ మరియు మెగ్నీషియం యొక్క మంచి మూలం. ఈ పోషకాలన్నీ టైప్ 2 డయాబెటిస్ సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. సమతుల్య ఆహారంతో పాటు చియా విత్తనాలను క్రమం తప్పకుండా తీసుకోవడం బరువు తగ్గడానికి సహాయపడుతుంది. బరువు తగ్గడం మధుమేహం నిర్వహణలో గణనీయంగా దోహదపడుతుంది. అంతేకాకుండా, చియా విత్తనాలు ప్రకృతిలో శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటాయి. కాబట్టి ఇది మీ రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుందని అంటున్నారు.

ఇతర ప్రయోజనాలు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది: చియా గింజలు తినడం వల్ల గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించవచ్చు. చియా విత్తనాలలో ఫైబర్ మరియు ఒమేగా-3 ఉంటాయి. ఇది మొత్తం రక్త కొలెస్ట్రాల్ మరియు %ూణూ% కొలెస్ట్రాల్ లేదా చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది.

ఎముకల ఆరోగ్యానికి: చియా గింజల్లో ఎముకల ఆరోగ్యాన్ని ప్రోత్సహించే అనేక పోషకాలు ఉన్నాయి. చియా గింజల్లో కాల్షియం, ఫాస్ఫరస్ మరియు మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. అందువల్ల, చియా విత్తనాలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది.

చియా సీడ్స్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్ అయిన కెఫిక్ యాసిడ్ శరీరంలో మంటతో పోరాడటానికి సహాయపడుతుంది. అందువల్ల, చియా విత్తనాలు దీర్ఘకాలిక మంటను నివారిస్తాయి.

చియా విత్తనాలను ఆహారంలో ఎలా చేర్చాలి? ఒక ఔన్స్ చియా గింజల్లో 10 గ్రాముల ఫైబర్ ఉంటుందని డాక్టర్ గుప్తా వివరించారు. పెద్దలు వారి వయస్సు మరియు లింగాన్ని బట్టి రోజుకు 22.4 మరియు 33.6 గ్రాముల ఫైబర్ తీసుకోవాలి. ఎవరైనా మధుమేహ వ్యాధిగ్రస్తులైతే, రోజుకు రెండు టేబుల్ స్పూన్లు లేదా 20 గ్రాముల చియా విత్తనాలను సిఫార్సు చేస్తారు, అతను సలహా ఇస్తాడు.

మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ ఆహారంలో చియా విత్తనాలను ఎలా చేర్చుకోవాలి. ఒక టేబుల్ స్పూన్ చియా గింజలను బాటిల్ వాటర్‌లో నానబెట్టి, దానికి సన్నగా తరిగిన నిమ్మకాయ ముక్కలను జోడించండి. పానీయాన్ని తయారు చేసిన గంట తర్వాత త్రాగాలి. మీ మధుమేహం ఆహారంలో చియా విత్తనాలను చేర్చడానికి మరొక మార్గం సలాడ్ల ద్వారా. తాజా పండ్లు, కూరగాయలు మరియు గింజలను జోడించడం అనువైనది, చియా మరియు ఫ్లాక్స్ వంటి విత్తనాలను చల్లడం వల్ల సలాడ్ ఫైబర్ అధికంగా ఉంటుంది. మీ రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడంలో సహాయపడుతుంది.

చియా విత్తనాల దుష్ప్రభావాలు మధుమేహం ఉన్నవారికి చియా విత్తనాలు చాలా ప్రయోజనాలను అందిస్తున్నప్పటికీ, అధిక వినియోగం సమస్యలను కలిగిస్తుంది. చియా గింజల యొక్క కొన్ని సాధారణ దుష్ప్రభావాలు మధుమేహం, అధిక రక్తపోటు, అలెర్జీలు లేదా జీర్ణ సమస్యలు. గాని, అతిగా తీసుకుంటే, ప్రతికూల ప్రభావాలను కలిగిస్తుంది. అందువల్ల, మధుమేహం నిర్వహణకు సిఫార్సు చేయబడిన దానికంటే ఎక్కువ చియా విత్తనాలను తినడం రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగ్గించడం వంటి దుష్ప్రభావాలకు దారితీయవచ్చు.

# ఇనుప పాత్రలో వండి తింటే ఐరన్ లోపం తగ్గుతుందా



ఐరన్ బాడీకి చాలా మంచిదని చెబుతారు. ఇందుకు ఐరన్ పాత్రల్లో వంట చేయడం మంచిదేనా తెలుసుకోవడం ముఖ్యం. మరి ఇదే విషయం గురించి ఏమంటున్నారంటే..

ఐరన్ వంట పాత్రాల్ని మనం ఇప్పుడు కాదు. పాతతరం నుంచే వీటిని వాడతున్నారు. వీటిలో వండడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని చెబుతారు.అదే విధంగా, ఈ పాత్రలు తక్కువ ధరకే లభించడమే కాకుండా చాలా ఎక్కువ రోజులు వీటిని వాడుకోవచ్చని చెబుతున్నారు.

క్యాస్ట్ ఐరన్ వంట పాత్రల్ని ఎప్పట్నుంచో వాడుతున్నారు. ఇవి వేడిని తట్టుకుని రస్ట్ ప్రూఫ్‌గా ఉంటాయి. అయితే, అల్యూమినియం పాత్రలు వచ్చాక.. వీటిని ఎక్కువగా వాడట్లేదు. ఇక నాన్ స్టిక్ వచ్చాక వీటి గురించి మర్చిపోయారు. అయితే, కొంతమంది చెఫ్‌లు మళ్ళీ వీటిని లైమ్‌లైట్‌లోకి తీసుకొస్తున్నారు.

ఐరన్ వంటపాత్రల్ని వాడడం, క్లీన్ చేయడం చాలా ఈజీ. అదే విధంగా తక్కువ నూనెతో వండుకోవచ్చు. గ్యాస్, ఎలక్ట్రిక్, ఇండక్షన్ దేనిపైనా కూడా బాగా పనిచేస్తాయి. ఆహారం ఎక్కువసేపు వేడిగా ఉండేలా ఉంటాయి. వీటిని క్లీన్ చేయడం ఈజీ. వీటిలో వంట చేయడం వల్ల ఆక్సిజన్ స్థాయిలు మెరుగుపడతాయని, సహజంగా రక్తంలో హిమోగ్లోబిన్ పెరుగుతుందని, రక్తహీనత వంటి సమస్యలు దూరమవుతాయని చెబుతున్నారు.

**ఆరోగ్య సమస్యలు..** అయితే, ఇనుప వంట పాత్రలు వాడకానికి వ్యతిరేకంగా కొంతమంది మాట్లాడుతున్నారు. ప్రపంచ వ్యాప్త అధ్యయనాలు ఐరన్ పాత్రలు వాడడం వల్ల ఆహారానికి ఐరన్ యాడ్ అవుతుందని చెప్పాయి. కానీ, ఆహారంలో ఇనుము లీచింగ్ పరిమాణం స్పష్టంగా ఆహార పీహెచ్ స్థాయి, ఆహారాన్ని వండడానికి అవసరమైన సమయం, వంటసామాన్లపై ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు.

ఇదే విధంగా జినాల్ పర్మార్ మాట్లాడుతూ.. ఇనుప వంట పాత్రాల్లో వండేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. అవేంటంటే.. ఆమ్ల ఆహార పదార్థాలు.. అంటే టమోట, పెరుగు, చింతపండు వంటి వాటిని ఉడికించడం, వండినప్పుడు ఆహారం లోహ ఉపరితలంతో చర్య జరుపుతుంది. ఆహారంలో ఇనుము విడుదల అవుతుంది. ఇవి నిజానికి విషయంతో సమానం. ఈ సరసాయన సమ్మేళనాలు వాంతులు, విరోచనాలు, మల, మూత సమస్యలతో పాటు లివర్‌పై ఎఫెక్ట్ చూపించి లివర్ ప్రాబ్లమ్స్ కారణమవతుందని చెబుతున్నారు.

**ఎందుకు వాడొద్దు..** వివిధ ఆహారాల్లో ఐరన్ లీచింగ్.. కచ్చితమైన పరిమాణాన్ని అర్థం చేసుకోవడానికి సంబంధిత అధ్యయనాలు అంతగా ఎఫెక్ట్ లేవు. ఇక ఐరన్ పాత్రల ద్వారా ఐరన్ అధికంగా గ్రహించడం వల్ల వచ్చే సమస్యల గురించి కూడా కచ్చితమైన పరిశోధనలు లేవు. అయితే, ఆహారంలో అధికంగా ఐరన్ చేరకుండా ఉండేందుకు వీటిని వాడడం తగ్గించారని చెబుతున్నారు.

# శరీరంలో విటమిన్ బి12 తగ్గితే? ఇది మీ శరీరంలో ఎలాంటి ప్రమాదాలను కలిగిస్తుందో తెలుసా?




మీ శరీరం ఖచ్చితంగా మరియు సరిగ్గా పనిచేయడానికి, మీరు అవసరమైన పోషకాల కోసం మీ రోజువారీ అవసరాలను తీర్చాలి. విటమిన్ బి12 మీ శరీరానికి అవసరమైన అత్యంత ముఖ్యమైన పోషకాలలో ఒకటి. ఇది డిఎన్ఎ సంశ్లేషణలో సహాయపడుతుంది, శక్తి ఉత్పత్తిలో సహాయపడుతుంది మరియు కేంద్ర నాడీ వ్యవస్థ పనితీరులో సహాయపడుతుంది. అలాగే, విటమిన్ బి12 ఎర్ర రక్త కణాల ఏర్పాటులో సహాయపడుతుంది మరియు మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

శరీరంలో విటమిన్ బి 12 తగినంత స్థాయిలో నిర్వహించడం చాలా ముఖ్యం. లేకపోతే, మీరు విటమిన్ బి12 లోపంతో బాధపడవచ్చు. ఈ ముఖ్యమైన పోషకం యొక్క లోపం వివిధ లక్షణాలకు దారితీస్తుంది మరియు మీ శరీరాన్ని వివిధ మార్గాల్లో ప్రభావితం చేస్తుంది. కాబట్టి, ఈ వ్యాసంలో విటమిన్ బి12 లోపాన్ని ఎలా నివారించాలో తెలుసుకోండి.

అలసట, తలనొప్పి మరియు మానసిక సమస్యలు శరీరానికి తగినంత విటమిన్ బి12 ఉన్నప్పుడు, ఎర్ర రక్త కణాల ఉత్పత్తి పెరుగుతుంది. ఇది శరీరమంతా ఆక్సిజన్‌ను తీసుకువెళ్లడానికి సహాయపడుతుంది. అయినప్పటికీ, శరీరంలో విటమిన్ బి12 తగినంత స్థాయిలో లేకపోతే, అది ఆక్సిజన్ సరఫరాని ప్రభావితం చేస్తుంది మరియు ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని తగ్గిస్తుంది. ఇది మెగాలోబ్లాస్టిక్ అనీమియాకు కారణమవుతుంది. ఈ ప్రభావాలన్నీ మీకు అలసట మరియు తలనొప్పిని కలిగిస్తాయి మరియు మూడ్ స్వింగ్‌లకు కూడా దారితీయవచ్చు.

జీర్ణశయాంతర సమస్యలు మన శరీరం ఆహారం నుండి విటమిన్ బి 12 పొందుతుంది. ఇది మనం తినే ఆహారంలోని ప్రొటీన్లతో బంధిస్తుంది. కడుపులోని హైడ్రోక్లోరిక్ యాసిడ్ మరియు ఎంజైమ్‌లు విటమిన్ బి12ని దాని ఉచిత రూపంలోకి విచ్ఛిన్నం చేస్తాయి. ఇది చిన్న ప్రేగులలో శోషణకు సహాయపడే ప్రొటీన్‌తో జతచేయబడుతుంది. అయినప్పటికీ, విటమిన్ బి-12 లోపం జీర్ణవ్యవస్థను ప్రభావితం చేస్తుంది. పోషకాలు లేకపోవడం వల్ల పేగుల్లోకి తగినంత ఆక్సిజన్ అందదు. ఇది అతిసారం, వికారం, మలబద్ధకం, ఉబ్బరం, గ్యాస్ మరియు ఆకలిని కోల్పోవడం మరియు బరువు తగ్గడం వంటి జీర్ణ సమస్యలకు దారితీస్తుంది.

నరాల నష్టం విటమిన్ బి12 నాడీ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడే ముఖ్యమైన పోషకం. అదనపు విటమిన్ బి12 లోపం 'శాశ్వత నరాల నష్టం'కు దారితీస్తుందని ఒక అధ్యయనం సూచిస్తుంది. ఆరోగ్య సంస్థ ప్రకారం, మునుపటి ఎక్స్‌పోజర్‌లు సాధారణంగా సూక్ష్మంగా లేదా లక్షణరహితంగా ఉంటాయి. అయినప్పటికీ, నాడీ సంబంధిత సమస్యలు అభివృద్ధి చెందితే, అవి కోలుకోలేనివని ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తుంది.

కొన్ని లక్షణాలు యుకె యొక్క నేషనల్ హెల్త్ సర్వీస్ విటమిన్ 12తో సంబంధం ఉన్న కొన్ని లక్షణాలను జాబితా చేస్తుంది. విటమిన్ బి12 లోపం యొక్క చిహ్నాలు లేత పసుపు చర్మం, పుండ్లు మరియు ఎరుపు నాలుక (గ్లోసిటిస్), నోటి పుండ్లు, మరియు నడిచే విధానంలో మార్పులు, అస్పష్టమైన దృష్టి, చిరాకు మరియు నిరాశ.

చర్మంపై చూడవలసిన లక్షణాలు విటమిన్ బి12 లోపం రక్తహీనతకు దారితీస్తుంది, దీనిని కోబాలమిన్ లోపం అని కూడా అంటారు. అలాగే, ఇది శరీరం తగినంత ఆరోగ్యకరమైన ఎర్ర రక్త కణాలను తయారు చేయనప్పుడు సంభవించే పరిస్థితిని సూచిస్తుంది. అందువల్ల, ఇది మీ చర్మానికి లేత పసుపు రంగును కలిగించే చర్మ సమస్యను కలిగిస్తుంది.

నోటి లక్షణాలు విటమిన్ బి12 లోపం లక్షణాలు మీ నోటిలో కూడా సంభవించవచ్చు. ఆ అసాధారణ లక్షణాలలో ఒకటి 'పరేస్తేసియా', ఇది అసహ్యకరమైన అనుభూతి లేదా జలదరింపు లేదా గుచ్చుకోవడం లేదా నాలుకలో వాపు లేదా మంటతో కూడిన నోటి పరిస్థితి. నాలుక వాపు మరియు వాపుతో సంబంధం ఉన్న పరిస్థితిని గ్లోసిటిస్ అంటారు.

## థైరాయిడ్ సమస్యకు ఇదే సమాధానం, ఈ విత్తనాలు డైట్‌లో ఉంటే చాలు



థైరాయిడ్ అనేది వయస్సుతో సంబంధం లేకుండా అందరికీ ఎదురౌతోంది. థైరాయిడ్ సాధారణ సమస్యే అయినా దీని కారణంగా ఇతర సమస్యలు చాలా ఏర్పడుతుంటాయి. థైరాయిడ్ సమస్య మూలంగా డయాబెటిస్, రక్తపోటు వంటి ఇతర ప్రమాదకర వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదముంది.

డయాబటిస్, కొలెస్ట్రాల్, అధిక రక్తపోటు వంటి లైఫ్‌స్టైల్ వ్యాధుల్లానే థైరాయిడ్ ఒకటి. థైరాయిడ్ నియంత్రణ పూర్తిగా మన చేతుల్లోనే ఉంది. ముఖ్యంగా ఆహారపు అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సి ఉంటుంది. నట్స్, సీడ్స్ వంటివి తరచూ తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ప్రయోజనకరం. వీటిని డైట్‌లో చేర్చడం ద్వారా థైరాయిడ్ సమస్యను నియంత్రించవచ్చు. థైరాయిడ్ వ్యాధిగ్రస్థులు ఎలాంటి డైట్ తీసుకోవాలో తెలుసుకుందాం.

**సన్‌ఫ్లవర్ విత్తనాలు:** థైరాయిడ్ సమస్య ఉంటే సన్‌ఫ్లవర్ విత్తనాలు చాలా మంచిది. ఎందుకంటే ఇందులో కేలరీలు తక్కువగా ఉంటాయి. వీటిలో ఉండే సెలేనియం థైరాయిడ్ నియంత్రణకు అద్భుతంగా దోహద పడుతుంది. అందుకే థైరాయిడ్ రోగులు డైట్‌లో సన్‌ఫ్లవర్ విత్తనాల్ని చేర్చుకోవాలి.

**ఫ్లక్స్ విత్తనాలు:** ఫ్లక్స్ సీడ్స్ విత్తనాల్లో పోషక పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. ఎందుకంటే ఇందులో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఫ్లక్స్ సీడ్స్‌లో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా ఇమ్యూనిటీ పటిష్టమౌతుంది. థైరాయిడ్ సమస్య దూరమౌతుంది. ఫ్లక్స్ సీడ్స్ విత్తనాలను రోజూ డైట్‌లో చేర్చుకోవాలి.

**చియా సీడ్స్:** చియా సీడ్స్‌ను సూపర్ ఫుడ్‌గా పిలుస్తారు. ఇందులో కావల్సిన అన్ని పోషక పదార్థాలుంటాయి. థైరాయిడ్ నియంత్రణలో దోహదమౌతుంది. థైరాయిడ్ వ్యాధిగ్రస్థులు చియా సీడ్స్ సేవిస్తే మంచి ఫలితాలుంటాయి. చియా సీడ్స్ స్వెల్లింగ్ నియంత్రణలో అద్భుతంగా పనిచేస్తాయి. పాలలో నానబెట్టి తీసుకుంటే మెరుగైన ఫలితాలుంటాయి.

## భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థాన్ రైల్వే ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ శిబిరం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థాన్ రైల్వే ఏరియా కమిటీ సాయిసొద విద్యార్థుల కోసం ఈ నెల 10 నుంచి 13 మే 2023 వరకు ఎంసెట్ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తోంది! శిక్షణ శిబిరంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులందరికీ ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సమాచారాన్ని రైల్వే ఏరియా కమిటీ కన్వీనర్ శ్రీ పి మోహన్ రావు తెలియజేశారు. మొబైల్ నంబర్ 9248052173/ 7384086177/ 6300366227 సంప్రదించండి.

## వైసీపీ ప్రభుత్వంలో మహిళలకు ఆర్థిక భరోసా




**దత్తిరాజేరు :** స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో, 975 స్వయం సహాయక డ్వాక్రా సంఘాలకు చెందిన 11,450 మంది మహిళలకు గజపతినగరం శాసనసభ్యులు బొత్స అప్పల నరసయ్య చేతుల మీదుగా 5,56,13,203 రూపాయలు ఆశరా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం ప్రత్యేకంగా మహిళలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. వైఎస్సార్ ఆశరా పథకం కింద విడుదలైన మూడో విడత మొత్తాన్ని మహిళల ఎకౌంట్లో జమ చేయనున్నట్లు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, ఏఎంసీ చైర్మన్ వేమల ముత్యాల నాయుడు, జడ్పిటిసి రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తి రెడ్డి రమేష్, బీసీ సెల్ అధ్యక్షులు మంత్రి అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు కడుబండి రమేష్ నాయుడు, ఏఎంసి వైస్ చైర్మన్ మండల శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షులు సుమన శ్రీనివాసరావు, బిఎస్ఎన్ఎల్ టెలికాం డైరెక్టర్ దత్తి చిరంజీవి, సర్పంచులు ఎంపీటీసీలు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నీతి ఆయోగ్ సి.ఇ.ఓతో జిల్లా కలెక్టర్ సమావేశం



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** నీతి అయోగ్ ముఖ్య కార్యనర్వహణాధికారి బి.వి.ఆర్.సుబ్రహ్మణ్యం అశావాహ (ఏస్పిరేషనల్) జిల్లాల కలెక్టర్లతో విశాఖపట్నంలో నోవాటెల్ హెూటల్ లో ఆది వారం సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. 397 గ్రామాలకు అన్ని వాతావరణంలకు తట్టుకునే రహదారులు అవసరం ఉందని, 12 గ్రామాలకు విద్యుత్ కల్పించాల్సి ఉందని చెప్పారు. జిల్లాలో 3.01 లక్షల పంట విస్తీర్ణం ఉందని అందులో 1.88 లక్షలకు జలవనరుల సదుపాయం ఉందని వివరించారు. పాచిపెంట మండలంలో ఇండస్ట్రియల్ పార్కుకు స్థలాన్ని గుర్తించామని చెప్పారు. విశాఖపట్నం - రాయపూర్ జాతీయ రహదారి, అరకు,పాడేరు, చింతపల్లి మీదుగా వెళుతున్న జాతీయ రహదారులను, జాతీయ రహదారి 26ను అనుసంధానం చేసి తూర్పు కనుమల కారిడార్ (ఈస్టర్న్ ఘాట్ కారిడార్) గా నామకరణం చేయాలని, తద్వారా పర్యాటక రంగం పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగి భారీ ఎకనమికల్ కారిడార్ గా అభివృద్ధి చెందగలదని, దీనిని పరిశీలించాలని కోరారు. ఈ సమావేశంలో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని పరీక్ష కేంద్రాలు వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలి



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** పట్టణంలో పలు పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స శిబిరాలను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డి ఐ ఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు పరిశీలించారు. పదవ తరగతి పరీక్షలు నేటి నుండి జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు సూచనలు మేరకు జిల్లా లో అన్ని పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ మేరకు డిఐఒ పట్టణంలో పలు ప్రథమ చికిత్స శిబిరాలను పర్యవేక్షించి మందులను పరిశీలించారు. ముఖ్యంగా డీ హైడ్రేషన్ , వికారం, గ్యాస్ట్రిక్ సమస్యలు, తలనొప్పి, జ్వరం మొదలగు సమస్యలకు ప్రాథమికంగా అవసరమైన మందులు, ఒ ఆర్ ఎస్ ప్యాకెట్లు ఏర్పాటు చేశారని, పరీక్షలు ముగిసేంత వరకు శిబిరాలను కొనసాగించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుమలలో శ్రీవారి వసంతోత్సవాలు - మూడు రోజులు సేవలు రద్దు..!



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుమలలో శ్రీవారి వసంతోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నేటి నుంచి ఈ నెల 5 వరకు మూడు రోజుల పాటు సాలకట్ల ఉత్సవాలు జరగనున్నాయి. ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ త్రయోదశి నాడు మొదలై మూడు రోజుల పాటు అంటే పౌర్ణమి నాడు వరకూ ఈ వసంతోత్సవాలు జరుగుతాయి. వసంతోత్సవాల సందర్భంగా పలు ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది. అటు ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ నెల 5న కళ్యాణం నిర్వహించనున్నారు.

తిరుమలలో శ్రీవారి వసంతోత్సవాలు తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజున శ్రీదేవి సమేతంగా శ్రీమలయప్ప స్వామి వారుని ఆలయ నాలుగు మాడ వీధిలో ఊరేగించారు. అనంతరం వసంతోత్సవ మండపానికి వేంచేపు చేశారు. వసంతోత్సవ అభిషేక నివేదన పూర్తయిన తర్వాత తిరిగి ఆలయానికి చేరుకుంటారు.

అనంతరం మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు స్వామి అమ్మవార్ల ఉత్సవాలకు స్వప్న తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనే, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేస్తారు. సాయంత్రం 4 నుంచి 6.30 గంటల వరకు శ్రీవారి ఆలయంలో ఘనంగా ఆస్థానం నిర్వహించనున్నారు.

వసంత ఋతువులో శ్రీ మలయప్పస్వామివారికి జరిగే ఈ ఉత్సవానికి 'వసంతోత్సవ'మని పేరు ఏర్పడింది. ఈ క్రతువులో సుగంధ పుష్పాలను స్వామికి సమర్పించటమే కాక వివిధ ఫలాలను కూడా నివేదించడం వసంతోత్సవంలో ప్రధాన ప్రక్రియని అధికారులు వెల్లడించారు.

ఈ నెల 5వ తేదీన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారితో పాటుగా శ్రీ సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవర్లు, శ్రీ రుక్మిణి సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులు వసంతోత్సవ వేడుకల్లో పాల్గొని తిరిగి సాయంకాలానికి ఆలయానికి చేరుకుంటారు. వసంతోత్సవాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 3 నుంచి 5వ తేదీ వరకు కల్యాణోత్సవం,ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

## ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైన పది పరీక్షలు



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయని జిల్లా కలెక్టరు డా. కృతికా శుక్లా తెలిపారు. సోమవారం ఉదయం స్థానిక సాలిపేట నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టరు కృతికా శుక్లా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించి, పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలను కలెక్టరు కృతికా శుక్లా.. అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి ఏప్రియల్ 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. కాకినాడ జిల్లా వ్యాప్తంగా 136 పరీక్ష కేంద్రాల్లో 29,988 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఆమె తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సెంటర్లలో పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు కలెక్టరు కృతికా శుక్లా వివరించారు. పోలీస్ స్టేషన్ల నుంచి పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాల తరలింపు, తిరిగి సమాధాన పత్రాలు పోస్ట్ ఆఫీస్ కు చేర్చే క్రమంలో అధికారులు పూర్తి అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందని కలెక్టరు కృతికా శుక్లా తెలిపారు.

ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎస్ అన్నపూర్ణ, సాలిపేట మున్సిపల్ పాఠశాల చీఫ్ సూపరింటెండెంట్ సుబ్బలక్ష్మి , పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన ఇగ్నో 36వ స్నాతకోత్సవం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ముప్పై ఆరోస్నాతకోత్సవం ఈ రోజు 04.03.2023 న ఘనంగా జరిగింది న్యూడిల్లీ లోని ఇగ్నో ప్రధాన కార్యాలయంలో గౌరవ భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగాజరిగిన ప్రధాన కార్యక్రమాన్ని ఆన్ లైన్ విధానం ద్వారా దేశంలోని అన్ని ప్రాంతాల విద్యార్థులు, ఉద్యోగులు వీక్షించారు. విశాఖపట్నం ఇగ్నో ప్రాంతీయ కేంద్రం పరిధిలో స్థానిక విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన ప్రాంతీయ స్నాతకోత్సవ కార్యక్రమానికి విజయనగరం లోని ఆంధ్ర ప్రదేశ్ కేంద్రీయ గిరిజన వ కులపతిఆచార్యటి.వి. కట్టిమణిగౌరవ అతిథిగా విచ్చేసి స్నాతకోపన్యాసం చేసి విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందించారు.

ఆచార్యకట్టిమణితన ఉపన్యాసంలో సమాజానికి అత్యంత అవసరమయిన కొన్ని అంశాలను చెబుతూ ఆ అంశాల్ని నాణ్యమైన విద్యద్వారా, అలాగే విభిన్నమైన ఆలోచనావిధానం ద్వారా, వినూత్న ఆవిష్కరణలద్వారా, పరిశోధనలద్వారా సమాజాన్ని ప్రశ్నించే సమస్యలకి ఏ విధంగా పరిష్కారాలు కనుగొనగలమో వివరించారు. దూరవిద్య ద్వారా ఉత్తమ విద్యనందించేందుకు అవసరమయిన అన్ని వనరులు ఉన్న విశ్వ విద్యాలయం ఇగ్నో అని, ఇగ్నో కోర్సులలో ఇమిడి ఉన్న ప్రత్యేక లక్షణాలు విద్యార్థులను సమాజానికి అవసరమయిన వ్యక్తులుగా మారుస్తాయని అన్నారు. రోజురోజుకూ మారుతోన్న నైపుణ్యాలను ఒడిసిపట్టి నిరంతరం వాటిని మెరుగుపరుచుకుంటేనే సరైన ఉపాధిని పొందగలుగుతారని ఆయన ఉద్భోదించారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రాంతీయ కేంద్ర సంచాలకులు డా. గోనిపాటి ధర్మారావు వార్షిక నివేదికను అందిస్తూ ఈ ప్రాంతీయ కేంద్రం పరిధిలోని గ్రామీణ అధ్యయన కేంద్రాలలో విద్యార్థుల అడ్మిషన్లు పెంచడానికి, నిరుద్యోగ గ్రామీణ యువతకు తోడ్పాటు నందించే ఎన్నో కొత్త నైపుణ్యాభివృద్ధి కోర్సులు ప్రారంభించడానికి కృషి చేసినట్లు తెలిపారు. అలాగే వివిధ కొత్తకోర్సులను విశాఖపట్నం ప్రాంతం విద్యార్థులకు కూడా అందుబాటులోకి తెచ్చినట్లు, ఇగ్నో అధ్యయన కేంద్రాలు లేనిచోట కొత్త అధ్యయన కేందాల ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇగ్నో పూర్వ ప్రాంతీయ సంచాలకులు డా. ఎస్ రాజారావు, విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మరియు ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డా. ఎస్. శోభారాణి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీ. లక్ష్మీపతి రావు, ఇగ్నో అధ్యయన కేంద్ర సమన్వయకర్తలు, సహ సమన్వయకర్తలు, ఇగ్నో ఉద్యోగులు పాల్గొన్నారు.

## పెట్టు గోడలు గ్రామంలోకాంగ్రెస్ పార్టీ ప్రజా దర్బార్



**అరకులోయ, (విశాఖ సమాచారమ్):** అరకు వేలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పాచిపెంట శాంతకుమారి ఆదేశాల మేరకు మండల మహిళా ఉప అధ్యక్షురాలు సిదారి రాధ లక్ష్మి హుకుంపేట మండలం పాతకోట పంచాయతీ. పెట్టు గోడలు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ గ్రామంలో సుమారు ఐదు కిలోమీటర్ల రోడ్డు మధ్యలో ఆపేయడం వలన గర్భిణీ స్త్రీలు అత్యవసర పరిస్థితుల్లో మండల కేంద్రానికి రావాలన్నా 108 వాహనము రావడానికి కూడా చాలా ఇబ్బందికరంగా ఉంటుంది పరిసర గ్రామాలకు మౌలిక సదుపాయాలు తక్షణమే కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నుండి డిమాండ్ చేస్తున్నాం పేరుకే వైసిపి రాష్ట్ర ప్రభుత్వం నాయకులు గొప్పలు చెప్పుకోవడానికి తప్ప పరిసర గ్రామాల్లో సమస్య పరిష్కరించడానికి ఎటువంటి చొరవ చూపకపోవడం చాలా దారుణంఈ విషయము జిల్లా కలెక్టర్ వారికి తెలియజేసి మా సమస్యలు కాంగ్రెస్ పార్టీ ద్వారా పరిష్కరించాలని గ్రామస్తులు మహిళా ఉపాధ్యక్షురాలుకి వినతి పత్రం కూడా అందజేయడం జరిగింది కనుక అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ గారు మరియు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి పాడేరు వారు తక్షణమే స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామ ప్రజల తరఫునకాంగ్రెస్ పార్టీ నుండి డిమాండ్ చేస్తున్నాము ఈ కార్యక్రమంలో పాంగి రమేష్ కొర్ర నాగేశ్వరరావు గేమెలికొండ బాబు కొర్ర సన్యాసి కొర్ర నాగరాజు గేమెల్లి రాంబాబు గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## స్పందన అర్జీలను సంతృప్తి స్థాయిలో పరిష్కరించాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను సంతృప్త స్థాయిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా ఎ మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో స్పందన దరఖాస్తుల పరిష్కారం పై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిటీషనర్లకు సమాధానం ఇచ్చే ముందు ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించి మళ్లీ తిరిగి రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. రీ ఓపెన్ పిటీషన్లు ఎందుకు వస్తున్నాయో చూసుకొని ,పరిష్కారంలో ఎటువంటి అశ్రద్ధ వహించరాదన్నారు. అర్జీదారులకు పూర్తి సంతృప్త స్థాయిలో సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

అనంతరం ప్రజల దగ్గర నుండి విజ్ఞప్తులు స్వీకరించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో 220 విజ్ఞప్తులు అందాయి.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.యస్ విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్ , పోలీస్ అధికారులు , మున్సిపల్ అధికారులు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అనకాపల్లి జిల్లా ఎస్పీ స్పందనకు 22 ఫిర్యాదులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లా పోలీసు కార్యాలయంలో ఏప్రిల్ 3న జిల్లా ఎస్పీ గౌతమి శాలి, "స్పందన" కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి, వారి సమస్యల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని, ఫిర్యాదు దారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.వీటిలో ముఖ్యంగా భూతగాదాలు, చీటింగ్ తదితర ఫిర్యాదులు అందాయి.

## స్పందనకు 268 అర్జీలు



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను తప్పనిసరిగా గడువులోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయ స్పందన సమావేశ మందిరంలో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా..జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, కెఎస్ఈజెడ్ ప్రత్యేక డీప్యూటీ కలెక్టరు కె. మనోరమ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డీఎస్ సునీతలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం 268 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా అర్జీ దారులు సంతృప్తి స్థాయిని పెంచే విధంగా అర్జీలను నాణ్యతతో పరిష్కారించాలని, జిల్లాస్థాయి అధికారులు.. క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుని అర్జీలు పరిష్కారమయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టొరేట్ వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణా చర్యలు భేష్



**విజయనగరం:** జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణకు తీసుకున్న చర్యలు అభినందనీయమని, నేషనల్ కౌన్సిల్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సిపిసిఆర్) సభ్యులు డాక్టర్ ఆర్.జి.ఆనంద్ అన్నారు. సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనకు, కలెక్టరేట్ వద్ద జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి స్వాగతం పలికారు. అనంతరం తన ఛాంబర్‌లో సమావేశాన్ని నిర్వహించి, జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణకు తీసుకున్న చర్యలను వివరించారు. బాల్య వివాహాల నిర్మూలనపై దృష్టి పెట్టామని, దీనిపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. బాల్యవివాహాలకు సిద్దపడిన తల్లితండ్రులకు అవగాహన కల్పించి, వాటిని ఆపివేయిస్తున్నామని అన్నారు. ముఖ్యంగా బాలికా విద్యకు ప్రాధాన్యత ఇస్తూ, బాలురతో సమానంగా బాలికలు కూడా డిగ్రీ లేదా ఇతర ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. వన్‌స్టాప్ సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు.

జిల్లాలో చిరుధాన్యాల ఉత్పత్తి ఎక్కువగా జరుగుతోందని, చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహాన్ని ఇస్తున్నామని కలెక్టర్ అన్నారు. చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం సంపూర్ణ సహకారాన్ని అందిస్తోందని వివరించారు. జిల్లాలో చేపట్టిన చర్యల పట్ల ఎన్‌సిపిసిఆర్ సభ్యులు ఆనంద్ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణా సంస్థ ఛైర్మన్ కేసలి అప్పారావు, జిల్లా ఛైర్మన్ హిమబిందు, డిఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఐసిడిఎస్ పిడి బి.శాంతకుమారి, జెడ్‌పి సిఇఓ డాక్టర్ ఎం.అశోక్‌కుమార్, సిపిఓ పి.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ద్రోణం రాజు. శ్రీ వాత్సవ్ మార్గదర్శకాలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** శ్రీ స్వామి వివేకానంద ఫ్రీ ట్యూషన్ సెంటర్లో చదువుతున్న విద్యార్థిని ,విద్యార్థులకు యువ నాయకుడు, ప్రముఖ సంఘ సేవకులు ద్రోణం రాజు. శ్రీ వాత్సవ్ గారు అమూల్యమైన సందేశాలు అందించారు. గతంలో చాలాసార్లు శ్రీ వాత్సవ గారు విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, జీకే బుక్స్, డిక్షనరీలను అందించి చాలా ప్రోత్సహించారు. ఇది పరీక్ష సమయమని , సంవత్సరం అంతా కష్టపడి చదివారు, బాగా ఎగ్జామ్స్ రాసి మంచి మార్కులు తెచ్చుకోవాలని, మరలా ఈ వేసవిలో సమ్మర్ క్యాంప్ లో ఉచిత యోగా తరగతులు, ఉచిత కూచిపూడి శిక్షణ శిబిరాలు నిర్వహిద్దామని ఆయన సూచించారు. విద్యార్థులు అందరితో శ్రీవత్సవ గారు హాట్ చాట్, పానీ పూరి, బాదం మిల్క్ మొదలైన స్నాక్స్ వాత్సవ గారి సొంత, ఖర్చులతో ఏర్పాటు చేసి, విద్యార్థులందరితో ఆయన షేర్ చేసుకున్నారు. విద్యార్థులు అందరితో మాట్లాడి వాళ్ల యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం వివేకానంద సంస్థ అధ్యక్షులు అప్పారావు గారు పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేసి, పిల్లలకు మొదటి గురువు తల్లిదండ్రులే అని, వాళ్లది మంచి మార్గంలో నడిపించవలసిన బాధ్యత తల్లిదండ్రులదే అని, స్కూల్లో నైతిక విలువలు నేర్పించి, విద్యార్థులుగా టీచర్లు తీర్చి దిద్దుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ద్వారంపూడి హయాంలో నగర అభివృద్ధి శూన్యం

**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి గడిచిన నాలుగేళ్ల కాలంలో నగరంలో చేసిన అభివృద్ధి శూన్యమని తెలుగుదేశం పార్టీ కాకినాడ పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు సుంకర పావని పేర్కొన్నారు. ఈ నాలుగేళ్లలో ఎమ్మెల్యే ద్వారంపూడి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులుతో ఎటువంటి అభివృద్ధి చేపట్టలేకపోయారని ఆమె విమర్శించారు. సోమవారం కాకినాడలోని జిల్లా టిడిపి కార్యాలయంలో ఆమె విలేకరులతో సమావేశాన్ని నిర్వహించారు.



ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నవరత్నాలలో భాగంగా మినహా మరెక్కడా రాష్ట్ర ఖజానా నుండి ఎటువంటి నిధులను తీసుకురాలేకపోవడం ఆయన విఫలం చెందారన్నారు. కాకినాడలో చిన్నారులకు ఎంతగానో ఉపయోగంగా ఉండే స్కేటింగ్ స్టేడియం, కాకినాడ కార్పొరేషన్ను కూల్చివేసి మొండి గోడలను అక్కడ మిగిల్చారన్నారు. కాకినాడ నగరపాలక సంస్థకు చెందిన నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేయించి కార్పొరేషన్ను దివాలా తీయించారన్నారు. తమ టిడిపి ప్రభుత్వ హయాంలో టిట్కో గృహ సముదాయాన్ని నిర్మిస్తే అది నేటికీ కూడా 1200 మంది లబ్ధిదారులకు అందించడంలో ఎమ్మెల్యే ద్వారంపూడి విఫలం చెందారన్నారు. నగరంలో ఏ ఒక్క మంచి ప్రాజెక్టు పూర్తిచేశారో బహిర్గతం చేయాలని పావని డిమాండ్ చేశారు. కాకినాడ నగరంలోని జయలక్ష్మి కోఆపరేటివ్ సొసైటీ చెందిన ఖాతాదారుల భవిష్యత్తును అతను పట్టించుకోకపోవడంతో మరో ఇదే తరహా కార్తికేయ బిల్డింగ్ సొసైటీ కూడా దివాలా తీసే దశలో ఉందని ఆమె చెప్పారు. ఎమ్మెల్యేగా ఉండి ప్రజలకు ఏం ఉపయోగపడే పనులు చేశారు ఆమె చెప్పాలన్నారు.

కాకినాడ నగరంలో పేద ప్రజలకు ఇల్లు ఇచ్చానని చెబుతున్న వైసీపీ నేతలు అది ఎక్కడ ఇచ్చారో ఆ ఇళ్లపై సంతృప్తి చెందామంటూ లబ్ధిదారులతో చెప్పించగలరా అని పావని ప్రశ్నించారు. కాకినాడ నగరంలో అన్యాయాలు, అక్రమాలు, భూకబ్జాలు, అరాచకాలు పెరిగిపోయాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త పన్ను నగర ప్రజల నుంచి పీడించి వసూలు చేసి పారిశుధ్యం, దోమల నివారణపై ఎటువంటి చర్యలను ఎమ్మెల్యే ద్వారంపూడి చేపట్టలేక పోయారన్నారు. స్థానిక జగన్నాధపురం లోని ఎన్టీఆర్ వారధి కుంగిపోతే ఆ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురాకుండా కార్పొరేషన్ ఖజానా సొమ్మును నిధులను వినియోగించడం వల్ల కార్పొరేషన్ దివాలా తీసిందని దీనికి ఎమ్మెల్యే ద్వారంపూడి వైఖరియే కారణమని పావని చెప్పారు.

ఈ సమావేశంలో టిడిపి నాయకులు చాపల లీలా ప్రశాంతి, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# అర్జీ దారులకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అర్జీ దారులకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో వివిధ మండలాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులనుండి దరఖాస్తులను జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టిమాట్లాడుతూ స్పందన వినతుల పరిష్కారంలో నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరచుకొని పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. స్పందన కార్యక్రమంలో స్వీకరించే ప్రతి దరఖాస్తును 24 గంటల్లో ఓపెన్ చేసి పరిష్కరించడమా లేదా తిరస్కరించడమా అనే అంశాలపై వివరణ ఇవ్వాలని, తిరస్కరించదలిస్తే సరైన కారణాలు తెలపాలన్నారు. ఎ.పి సేవ పోర్టల్లో ఉన్న పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. రెవెన్యూ వినతులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.మండల స్థాయిలో కూడా క్వాలిటీ డిస్పోజల్ పెరగాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న స్పందన కార్యక్రమంలో ఏ ఒక్కరు నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శించకుండా జవాబుదారితనంతో పరిష్కరించాలని, ఏ ఒక్క దరఖాస్తు బియాండ్ ఎస్-ఎల్ఏ లోకి వెళ్లకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో 189 మంది అర్జీదారులు తమ సమస్యలపై జిల్లా కలెక్టర్ కు దరఖాస్తులు అందజేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.ఈ స్పందన కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. వీఆర్వో వెంకటరమణ స్వయంగా అర్జీదారుల దగ్గరకు వెళ్లి ఫిర్యాదులు స్వీకరించారు.

# షుగర్ ఫ్యాక్టరీ లాక్కౌట్ లో ఉండడం వలన రైతులకు ఇబ్బందులు



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** షుగర్ ఫ్యాక్టరీ ల్కోచిట్ లో ఉండడం వలన రైతులు కు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పార్వతీపురం మన్యం జిల్లా ఏ.పి.టిడ్కో ఛైర్మెన్ జమ్మాన ప్రసన్న కుమార్ అన్నారు.పర్యటనలో భాగముగా నేడు సీతానగరం మండలం, చెల్లం నాయుడు వలస లక్ష్మీపురం గ్రామ పెద్దలు తుమ్మలపల్లి సత్యవతి (సర్పంచ్) పార్వతమ్మ గంగు నాయుడు (ఎంపీటీసీ) ఇతర గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు లక్ష్మీపురం గ్రామములో మండు టెండల్లో పర్యటించి అక్కడి రైతుల తో నేరుగా మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది.ప్రధానంగా సీతానగరం మండలం చుట్టు ప్రక్కల ఉన్నటువంటి రైతులు అందరూ వ్యవసాయమే జీవనాధారంగా చేసుకొని జీవించడం జరుగుతుంది, ప్రధానముగా ఎక్కువ శాతం మంది రైతులు వర్షపు నీరు మరియు బోర్ల సదుపాయముతో వాణిజ్య పంట అయినటువంటి చెరుకు ను పండించడం ఇక్కడి రైతుల జీవనాధారం వారి వ్యవసాయం భూములు ఆ పంట పండించేందుకు అనుకూలంగా ఉండటం ప్రధానముగా ఈ ప్రాంతము లో సుగర్ ఫ్యాక్టరీ కూడా ఉండటం వలన రైతుల పండించే పంటకు గిట్టుబాటు ధర రావడంతో పాటు పండించే పంటను వెంటనే అమ్ముకునే వెసులుబాటు ఉండేది.కానీ నేడు ఆ షుగర్ ఫ్యాక్టరీ లాక్ ఔట్ లో ఉండటం వలన అక్కడి రైతులు తీవ్ర ఇబ్బందులు గురి కావడం జరుగుతుందని రైతులందరూ తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు తెలియజేయడం జరిగింది.రైతుల సమస్యలపై స్పందిస్తూ ఈ ప్రభుత్వం రైతు బంధు ప్రభుత్వమని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి రైతుల సంక్షేమ కొరకు అహర్నిశలు కృషి చేస్తున్నారని కనుక రైతులు పడుతున్నటువంటి ఇబ్బందులును తప్పకుండా ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకొని వెళ్లి అవసరమైన ప్రత్యామ్నాయ మార్గాలు ద్వారా పండించిన పంటకు గిట్టబాటు ధరతో పాటు సకాలములో అమ్ముకునే అవకాశం కల్పించే దిశగా తనవంతు సహాయ సహకారాలను అందిస్తానని రైతులకు హామీ ఇవ్వడం జరిగింది. అంతే కాకుండా గ్రామములో ఉన్నటువంటి రోడ్ల సదుపాయాలను కూడా అక్కడి రైతులు నాయకులతో కలిసి పరిశీలించడం జరిగింది..అవసరమైన చోట వెనువెంటనే బాగుచేసే విధముగా సంభందిత అధికారుల దృష్టికి తీసుకొని వెళ్తానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో పైన తెలిపిన గ్రామ పెద్దలు గంగు నాయుడు చెల్లం నాయుడు వలస పెద్దలు శ్రీనివాస్ పువ్వల అప్పారావు , రాము ,మాజీ సర్పంచ్ గాజాపు వెంకట నాయుడు ,సప్పా ఉమా మహేశ్వర రావు ,గవర చిన్నం నాయుడు చెరుకు రైతులు పాల్గొన్నారు.

# బీసీలకు అన్యాయం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

## బీసీ నేతలు ఆరోపణ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తుందని బిసి సంఘాల నేతలు ఆరోపించారు. సోమవారం బీసీ సంఘాల ఐక్యకార్యాచరణ రౌండ్ టేబుల్ సమావేశం డాబా గార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగింది. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షుడు పల్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ 34 శాతం చట్టసభల్లో రిజర్వేషన్లు ఇవ్వాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం 24 శాతం రిజర్వేషన్లు మాత్రమే బీసీలకు కల్పిస్తుందని అన్నారు. 140 బిసి కులాలు 30 ఎంబిసి కులాలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. ఇప్పటికీ 89 కులాలు అసెంబ్లీలో అడుగుపెట్టలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 56 కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఇప్పటికీ కార్యాలయాలు గాని ఛైర్మన్లుకు అధికారాలు గాని ఇవ్వలేదని విమర్శించారు. బీసీ ఓటర్లను చైతన్యపరచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో రాష్ట్ర బీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు కొల్లి రవీంద్ర, మాజీమంత్రి కొండ్రు మురళి, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవ రావు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, గండి బాబ్జి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి భీమర శెట్టి శ్రీనివాసరావు, సిపిఎం పార్టీ నాయకులు ఎం పైడిరాజు బీసీ నేత ఏర్ల శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జై బిసి జయహో బిసి, అంటూచేయి చేయి కలిపి బీసీ నేతలు నినాదాలు చేశారు.








VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16,Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345,
Visakhapatnam : Cell : 9346314199, Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96660 15921,
Paravaada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389, Cheedikaada : Cell: 97686 33999, Gaajuwaaka : Cell: 70139 78488